

సున్నా వడ్డీ కలేనా?



స్వయం సహాయక సంఘాల ద్వారా ఉపాధి పొందే మహిళలపై రుణాల వడ్డీ భారం తప్పడం లేదు. రాయితీతో తమపై భారం తగ్గుతుందని ఆశించిన వారికి.. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా వడ్డీ మోత తప్పడం లేదు. ఎన్నికల హామీ మేరకు.. ప్రభుత్వం కొలువు దీరి 15 నెలలైనా.. ఇంత వరకు 'సున్నా వడ్డీ' ఊసే లేదు. బడ్జెట్ కేటాయింపుతో హడావుడి చేసినా.. ఆచరణ శూన్యం కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం సున్నా వడ్డీపై పిల్లి మొగ్గలు వేసి.. చివరి విడత వడ్డీ డబ్బులు చెల్లించలేదు.



- డ్వాక్రా సంఘాలకు తప్పని భారం
- పరిమితి తగ్గించిన గత ప్రభుత్వం
- 'ఆసరా'లోనూ మహిళలకు టోకరా..!
- కూటమి ప్రభుత్వంలో ఊసేలేని రాయితీ హామీ అమలు..

గుంటూరు, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 74,640 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో ఏడు లక్షల మంది మహిళలు ఉన్నారు. బాపట్ల జిల్లాలో భాగమైన చీరాల డివిజన్‌ను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య ఎనిమిది లక్షలకు పెరుగుతుంది. వీరు ఏటా స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.3 వేల కోట్ల మేర రుణాలు తీసుకుంటుంటారు. ఆయా కేటగిరీలను బట్టి 9 నుంచి 13.5 శాతం వరకూ వీరు బ్యాంకులకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఏటా మూడు జిల్లాల్లో వీరిపై దాదాపు రూ.125 కోట్ల మేర వడ్డీ భారం పడుతోంది.

ఎన్నికల హామీ అమలుకు నోచుకునేనా?

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్వయం సహాయక సంఘాల మహిళలపై వడ్డీ భారం తగ్గిస్తామని కూటమి పార్టీలు ఎన్నికల హామీ ఇచ్చాయి. గత వైసీపీ ప్రభుత్వం సున్నా వడ్డీ పరిమితిని రూ.3 లక్షలకే పరిమితం చేసి మోసం చేసిందని, తాము రూ.10 లక్షలకు పెంచుతామని అట్టహాసంగా ప్రకటించాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలు పూర్తయింది. కానీ, మహిళలకు ఇచ్చిన సున్నా వడ్డీ హామీ మాత్రం అమలుకు నోచుకోలేదు.

గతంలో వంచించిన వైసీపీ ప్రభుత్వం..

వైఎస్సార్ సున్నా వడ్డీ పేరుతో గత వైసీపీ ప్రభుత్వం మహిళలకు వడ్డీ రాయితీ ఇస్తానని చెప్పింది. ఆచరణలో మహిళలను ఘోరంగా వంచించింది. 2014-19 మధ్య కాలంలో గ్రూపు రుణం రూ.5 లక్షల వరకూ వడ్డీ రాయితీ ఇవ్వగా, వైసీపీ సర్కార్ 'వైఎస్సార్ సున్నా వడ్డీ' పేరుతో దాన్ని రూ.3 లక్షలకు పరిమితం చేసింది. దానికి కూడా అనేక షరతులు పెట్టింది. దీంతో అన్ని డ్వాక్రా సంఘాలు అంతకు ముందు ప్రభుత్వంలో కంటే అదనంగా వడ్డీ చెల్లించాల్సి వచ్చింది. రూ.5 లక్షల కంటే ఎక్కువ రుణం తీసుకున్న చాలా సంఘాలు సున్నా వడ్డీకి దూరం కావాల్సి వచ్చింది. ఫలితంగా మూడు జిల్లాల మహిళలపై రూ.110 కోట్ల వడ్డీ భారం పడింది.

● 'ఆసరా'లోనూ టోకరా..

2019 ఏప్రిల్ 11 నాటికంటే ముందు చెల్లించిన రుణాలకు కూడా వడ్డీని రీయింబర్సు చేస్తామని అప్పట్లో వైసీపీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక 'ఆసరా' పేరుతో నాలుగు విడతలుగా ఆ వడ్డీని తిరిగి (మిగతా 6వ పేజీలో)



- ఖాట్మండూలో చిక్కుకుపోయిన 8 మంది మంగళగిరి వాసులు
- ఫోన్, వాట్సాప్ కాల్స్‌తో టచ్‌లో ఉన్న మంత్రి లోకేశ్
- స్వస్థలాలకు వచ్చేంత వరకు సహాయక చర్యలు

నేపాల్ బాధితులకు అండగా లోకేశ్

మంగళగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నేపాల్ పర్యటనకు వెళ్లి అక్కడి ఉద్రిక్త పరిస్థితుల మధ్య చిక్కుకుపోయిన 261 మంది తెలుగు వారిలో.. మంగళగిరి నగరానికి చెందిన వారు ఉన్నట్లు ప్రభుత్వానికి సమాచారం అందింది. 8 మంది నగరానికి చెందినవారున్నారని గుర్తించారు. వీరిలో ఏపీ ఎంఎస్ ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు సమీప బంధువులు, కుప్పురావు కాలనీకి చెందిన దామర్ల శివరామకృష్ణ, ఆయన భార్య లక్ష్మి ఉన్నారు. వీరు వారం క్రితం నేపాల్ పర్యటనకు వెళ్లినట్లు తెలిసింది. వీరితోపాటు చిన పంజా వీధికి చెందిన బియ్యం వ్యాపారి మాచర్ల హేమసుందరరావు, ఆయన భార్య వెంకట నాగకుమారి, స్థానిక డెంటల్ డాక్టర్ చక్రవర్తి తల్లిదండ్రులు చింతక్రింది ప్రసాద్, చింతక్రింది పద్మావతి ఉన్నారు. అలాగే మంగళగిరికి చెందిన గోలీ వరదరాజు, గోలి రామజ్యోతి నేపాల్ రాజధాని ఖాట్మండులోని హోటళ్లలో తలదాచుకున్నట్లు సమాచారం అందింది. నేపాల్‌లో తెలుగువాళ్లు చిక్కుకున్నారన్న సమాచారం రావడంతో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ బుధవారం ఉదయం అనంతపురం పర్యటనను రద్దు చేసుకున్నారు. ఉదయం పది గంటలకల్లా వెలగపూడి సచివాలయంలోని ఆర్‌జీఎస్ సెంటర్‌కు చేరుకుని వార్ రూంను ఏర్పాటు చేసి, పరిస్థితిని నిరంతరం సమీక్షించారు. నేపాల్‌లోని భారత రాయబారి కార్యాలయంతోపాటు ఢిల్లీలోని ఏపీ భవన్ అధికారులు, వివిధ శాఖల మంత్రులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ నేపాల్‌లో చిక్కుకుపోయిన వారితో ఫోన్, వాట్సాప్ కాల్స్ ద్వారా మాట్లాడుతూ వారికి ధైర్యం చెప్పారు. అందరినీ క్షేమంగా స్వస్థలాలకు తీసుకొస్తామని, ఎవరూ అధైర్యపడొద్దన్నారు. ప్రస్తుతానికి అందరూ బస చేసిన హోటళ్లలోనే ఉండిపోవాలని సూచించారు. ప్రతి రెండు గంటలకోసారి మంత్రితోపాటు.. అధికారులు ఫోన్‌లో వారిని సంప్రదిస్తూ..ఎప్పటి పరిస్థితులను ఆరా తీస్తున్నారు. ప్రత్యేక విమానాల ద్వారా తెలుగువారందరినీ రాష్ట్రానికి తీసుకువచ్చేంత వరకు సహాయ సహకారాలు అందిస్తామని బాధితులకు లోకేశ్ భరోసానిచ్చారు. ప్రత్యేక కాల్ సెంటర్‌ను, వాట్సాప్ నంబర్లను అధికారులు అందుబాటులో ఉంచాలని, జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. మంగళగిరికి చెందిన మాచర్ల హేమసుందరరావు, నాగలక్ష్మితో లోకేశ్ వీడియో కాల్‌లో మాట్లాడారు. తాము ఖాట్మండులోని పశుపతి ఫ్రంట్ హోటల్‌లో ఉన్నామని, నిన్న తాము ప్రయాణిస్తున్న బస్సుపై ఆందోళనకారులు రాళ్లు రువ్వి దాడులు చేశారని నాగలక్ష్మి వివరించారు. తమతోపాటు ఇదే హోటల్‌లో మరో 40 మంది వరకు తెలుగువాళ్లు ఉన్నట్లు ఆమె లోకేశ్‌కు వివరించారు. తమ హోల్ ఖాట్మండు ఎయిర్ పోర్టుకు కిలోమీటరు దూరంలో ఉన్నట్లు నాగలక్ష్మి చెప్పారు. కాగా, నేపాల్‌లో చిక్కుకుపోయిన మంగళగిరి వాసులతో ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు నిరంతరం ఫోన్‌లో మాట్లాడుతూ.. వారికి బాసటగా నిలిచారు. లోకేశ్.. హోంమంత్రి అనిత, ఏపీ భవన్ అధికారి అర్జా శ్రీకాంత్, సీనియర్ ఐఏఎస్ అధికారులు కార్తికేయ మిశ్రా, ముఖేష్‌కుమార్ మీనా, కోన శశిధర్, అజయ్‌జైన్, హిమాన్షు శుక్లా, జయలక్ష్మి తదితరులతో సుదీర్ఘంగా సమీక్షించారు.



పొగాకు కొనుగోళ్లలో గందరగోళం

- కారంచేడు రైతులకు తెనాలి షెడ్యూల్
- మార్క్‌ఫెడ్ అధికారుల వైఖరిపై నిరసన
- కొనకపోతే మీరే తగలబెట్టండని ఆగ్రహం

తెనాలి, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రకారం వచ్చే రైతుల నుంచి ఒక్క ఆకు కూడా మిగలకుండా కొంటామని ప్రభుత్వం చెబుతుంది. కానీ మార్క్‌ఫెడ్ అధికారులు తీరు మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. కారంచేడు మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో పొగాకు పండించిన రైతులకు వారి సరకు అమ్ముకునే అవకాశాన్ని తెనాలి మార్కెట్ యార్డుకు షెడ్యుల్ ఇచ్చారు. నాలుగు రోజులుగా పొగాకు బేళ్లు తీసుకొస్తుంటే, కొంతవరకు కొనుగోలు చేస్తున్నారని, చాలావరకు వంకలు పెడుతున్నారంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కారంచేడు రైతులు తెనాలి యార్డులో తమ సరకు కొనుగోలు చెయ్యాలంటూ నిరసనకు దిగారు. కొనకపోతే మీరే తగలబెట్టేయండంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్క్‌ఫెడ్ అధికారులు కాకుండా, బయటివారు సరకు నాణ్యతను నిర్ధారిస్తున్నారని, వారికి ఇష్టమొచ్చిన వాటిని, సిఫార్సులున్న వాటిని కొంటున్నారని, లేనివారివి అసలు పట్టించుకోవడంలేదనేది రైతుల ఆరోపణ. నాసిరకంగా ఉన్నా క్వింటాకు రూ.6 వేలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించినా మార్క్‌ఫెడ్ అధికారులు అవేమీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొలుత అధికారులు సరుకు పరీక్షించిన తర్వాతే ఎప్పుడు, ఏ కొనుగోలు కేంద్రానికి వెళ్లాలనేది నిర్ణయించి, షెడ్యూల్ ఇస్తున్నారని, దీంతో రూ.10 వేల నుంచి రూ.15 వేలు ఖర్చు చేసుకుని వస్తే అధికారులు తిప్పి పంపుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. తేమ ఎక్కువగా ఉన్న సరకు తీసుకొస్తున్నారని, పది రోజుల క్రితం అవగాహన కల్పించినా, వారు పాటించకుండా వస్తున్నారని మార్క్ ఫెడ్ అధికారులు చెబుతున్నారు.

కొనమని చెప్పడం లేదు

పొగాకు కొనుగోళ్లలో నాణ్యత నిర్ధారణకు ఐటీసీ సహకారం తీసుకున్నాం. వారు పరీక్షించి క్వాలిటీ నిర్ణయిస్తున్నారు. పైగా కొనలేమని ఎవరికీ చెప్పడం కానీ, తిప్పిపంపడం కానీ చేయడంలేదు. సరకు నాణ్యత లేకున్నా, తేమ శాతం ఎక్కువగా ఉన్నా, వాటిని కొని గోదాములో మంచి సరుకుతోపాటు నిల్వ ఉంచితే, వాటికి ఫంగస్ సోకుతుంది. దీని వల్ల మొత్తం పొగాకు నాశనమైపోతుంది. అందుకే తేమ తగ్గేవరకు ఆగి, తర్వాతే తీసుకురమ్మంటున్నాం.

- కరుణ, డీఎం, మార్క్‌ఫెడ్, బాపట్ల జిల్లా



నాయుడమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఆర్థికవేత్త నాగరాజు, శాస్త్రవేత్త స్వర్ణ వికాంత్

6

గ్రామీణ ఆర్థిక వికాసంతోనే.. సుసంపన్న భారత్

- ఇందుకు విప్లవాత్మక ఆర్థిక సంస్కరణలు తీసుకొస్తున్నాం
- యూపీఐ దేశ ఆర్థిక లావాదేవీల విధానాన్నే మార్చింది
- భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి నాగరాజు
- నాగరాజుకు నాయుడమ్మ పురస్కారం ప్రదానం

నూతన జేసీ బాధ్యతల స్వీకారం

అశుతోష్ శ్రీవాస్తవకు అధికారుల స్వాగతం



జేసీగా బాధ్యతలు స్వీకరిస్తోన్న శ్రీవాస్తవ

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ అశుతోష్‌శ్రీవాస్తవ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌కు వచ్చిన ఆయనకు తొలుత కలెక్టరేట్ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం జేసీ చాంబర్‌లో సీటీసీ ఫైలుపై సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన కలెక్టర్ నాగలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో ఎవరెవరు ఏమేమి బాధ్యతలు నిర్వహిస్తారనే విషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలి, గుంటూరు ఆర్డీవో కే శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు, గుంటూరు తూర్పు, పశ్చిమ, కాకుమాను, తాడికొండ తహసీల్దార్లు సుభాని, వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, మెహర్‌కుమార్ పాల్గొన్నారు.

పరిశీలన ప్రహసనం

- కొలిక్కిరాని డీఎస్సీ సర్టిఫికెట్ల సమస్యలు
- కత్తి మీద సాములా ఈడబ్ల్యూఎస్ అర్హత గుర్తింపు
- దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాల్లో రోజుకో కొత్త సమస్య

గుంటూరు(విద్య), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈడబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్లలో వాస్తవమెంత.. దివ్యాంగుల ధ్రువీకరణలో అర్హత ఉందా.. వివాహమైనా భర్తల ప్రస్తావన లేకుండా తల్లిదండ్రుల ఆశ్రయంలో ఉన్నట్లు కొందరు దరఖాస్తులో చూపడం.. ఇలా అనేక సమస్యలతో మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ఇంకా కొలిక్కిరాలేదు. ఒక సమస్య పరిష్కారం అయితే మరో సమస్య ఉత్పన్నం కావడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రధానంగా దివ్యాంగుల సర్టిఫికెట్ల విషయంలో నెలకొన్న సమస్యలను అధికారులు క్రమంగా పరిష్కరించుకుంటూ వస్తుండగా ఈడబ్ల్యూఎస్ (ఎకనామికల్లీ వీకర్స్ సెక్షన్) అభ్యర్థుల విషయంలో కొన్ని సమస్యలు వచ్చాయి. దీంతో అధికారులు వీటిపై దృష్టి సారించి పూర్తిస్థాయిలో విచారించిన తర్వాతనే ఈడబ్ల్యూఎస్‌కు అర్హత నిర్ధారిస్తున్నారు. మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమై ఇప్పటికే 10 రోజులు గడిచింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో దాదాపు 1600 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. వందమందికి పైగా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వివిధ దశల్లో ఉంది. ఈ క్రమంలో ఇప్పటికే సర్టిఫికెట్లలో అర్హతలకు సంబంధించి అనేక సమస్యలను అధికారులు గుర్తించారు. ఆయా సర్టిఫికెట్ల పరిశీలనలో సమస్యలు కొలిక్కి రాకపోవడంతో అధికారులు నిత్యం ఈ పనిలో తల మునకలవుతున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసి అర్హులను ఎంపిక చేసే ప్రక్రియ అధికారులకు కత్తిమీదసాములా మారింది. దాదాపు 23కి పైగా బృందాలు సర్టిఫికెట్ల పరిశీలనలో నిమగ్నమయ్యారు. ఎక్కడ చిన్న పొరపాటు జరిగినా రాష్ట్రస్థాయిలో సమస్యలు వస్తాయని అత్యంత ఖచ్చితత్వంతో పరిశీలన చేస్తున్నారు. ఈ నెల 17 లోగా పరిశీలన ప్రక్రియను ముగించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ఈడబ్ల్యూఎస్ అర్హతపై అనుమానాలు..

మెగా డీఎస్సీలో కొంతమంది మహిళా అభ్యర్థులు భర్తలు ఉద్యోగం చేస్తున్నా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు పెట్టినట్లు అధికారుల పరిశీలనలో తేలింది. ఇటువంటివారు కనీసం పదిమందికిపైగా ఉన్నట్లు సమాచారం. మహిళలకు వివాహం కాకుండా ఉన్నప్పుడే తల్లిదండ్రులకు సంబంధించిన ఈడబ్ల్యూఎస్ వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఇద్దరు మహిళల భర్తల్లో ఒకరు కానిస్టేబుల్ కాగా, మరొకరు సచివాలయ ఉద్యోగి. వారి భర్తల వార్షిక ఆదాయం రూ.8 లక్షల లోపే కావడంతో ఈడబ్ల్యూఎస్ కేటగిరీ కింద సదరు మహిళలని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. మరికొంత మహిళలు తమ భర్తలు వ్యాపారాలు చేస్తూ ఐటీ రిటర్న్స్ దాఖలు చేసినా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లతో డీఎస్సీకి అర్హత సాధించారు. అయితే వారి భర్తలు ఐటీ రిటర్న్స్ దాఖలు చేస్తే వీరు (మిగతా 6వ పేజీలో)



డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనలో పాల్గొన్న అభ్యర్థులు

స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో.. 6వ ర్యాంక్

- దక్షిణ భారత్‌లో గుంటూరుకి మాత్రమే అవార్డు



వివరాలు వెల్లడిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం.. పరిశుభ్రతలో గుంటూరు నగర పాలక సంస్థ జాతీయ స్థాయిలో ఆరో ర్యాంకు సాధించింది. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం(ఎన్‌క్యాప్) చేపట్టిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో దక్షిణ భారతదేశంలో అవార్డు అందుకున్న ఏకైక నగరంగా గుంటూరు ఘనత సాధించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చి నట్లు మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో 130 నగరాలు పోటీపడగా 10 లక్షలలోపు జనాభా కేట గిరిలో గుంటూరుకి ఆరో ర్యాంకు దక్కిందన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ మండలి 130 నగరాల్లో స్వచ్ఛ వాయు సర్వే క్షణ్ అంశాలను పరిశీలించి, 2024-25 ఏడాదికి ఉత్తమ నగరాలను సిఫా ర్సు చేసిందన్నారు. శంకర్ విలాస్ ఆర్వోబీ పనుల కారణంగా గుంటూరు ఆరో ర్యాంకుకు పరిమితం కావాల్సి వచ్చిందని, లేకుంటే మంచి ర్యాంకు సాధించే వారమని తెలిపారు. ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయస్థాయిలో సూపర్ సిటీగా అవార్డు సాధించామన్నారు.

బాపట్లకు నేడు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

- ఉపముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం
- సూర్యలంక రోడ్డులోని నగరవనం ముస్తాబు
- తీర ప్రాంత రక్షణకు గ్రీన్‌వాల్ ఏర్పాటుకు ప్రణాళికలు
- అమరులైన 23 మంది అటవీ అధికారుల కుటుంబీకులతో భేటీ



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జాతీయ అటవీ అమరవీరుల దినం సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గురువారం బాపట్లలో పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఉపముఖ్యమంత్రి హోదాలో పవన్‌కల్యాణ్ తొలిసారి బాపట్లకు రానుండడంతో అధికారులు ఏర్పాట్లను కట్టుదిట్టంగా చేస్తున్నారు. పవన్ రాక కోసం జనసేన శ్రేణులు కూడా పెద్దసంఖ్యలో ఎదురు చూస్తున్నారు. పవన్‌కల్యాణ్ కోసం సూర్యలంక తీరాన్ని ముస్తాబు చేశారు. సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ఉదయం 9:15కు పవన్ చేరుకోనున్నారు. అక్కడ నుంచి రోడ్డుమార్గంలో సూర్యలంకతీరం చప్టా సమీపంలో రాజమండ్రి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన తాటి మొక్కలు నాటి గ్రీన్‌వాల్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. తీరప్రాంత భద్రతకు రక్షణ కవచంగా ఉండేలా గ్రీన్‌వాల్ ఏర్పాటు ఆవశ్యకతపై ఆయా విభాగాల అధికారులతో చర్చించనున్నారు. నగరవనంలో అటవీ అమరవీరుల దినోత్సవంలో పాల్గొంటారు. సూర్యలంక రోడ్డులోని నగరవనంలో ఏర్పాటు చేసిన అటవీ అమరవీరుల స్థూపాన్ని డిప్యూటీ సీఎం ఆవిష్కరించనున్నారు. అటవీ సంపదను కాపాడే క్రమంలో విధి నిర్వహణలో రాష్ట్రవ్యాప్తంగా అమరులైన 23 మంది కుటుంబాలతో పవన్‌కల్యాణ్ ఆత్మీయంగా సమావేశం కానున్నారు. వారికి ఆర్థిక సాయం కూడా అందించనున్నారు. డ్వామా, అటవీ విభాగాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను డిప్యూటీ సీఎం తిలకించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ పరిశీలించారు. ఆయన వెంట కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, జనసేన నాయకులు ఉన్నారు. పవన్ పర్యటనకు సంబంధించిన కాన్వాయ్ ట్రయల్‌రన్ కూడా బుధవారం సాయంత్రం జరిగింది. బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది సంయమనంతో వ్యవహరిస్తూ సమర్థంగా విధులు నిర్వహించాలని ఎస్పీ తుషార్‌డూడి ఆదేశించారు. ఎస్పీ నిర్వహించిన సమావేశంలో డీఎస్పీలు జి.రామాంజనేయులు, ఎండీ మొయిన్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది త్యాగాలు గుర్తుచేసుకునేందుకు..

ప్రతి ఏడాది సెప్టెంబరు 11న జాతీయ అటవీ అమరవీరుల దినాన్ని నిర్వహిస్తారు. ఖేజ్రీ చెట్లను రక్షించడానికి బిష్ణోయ్ తెగవారు చేసిన చారిత్రాత్మక త్యాగానికి చిహ్నంగా సెప్టెంబరు 11కు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. అటవీ సిబ్బంది త్యాగాలను గుర్తు చేసుకుని వారికి డిప్యూటీ సీఎం పవన్ నివాళులు అర్పించనున్నారు.



పవన్‌కల్యాణ్ పర్యటన సందర్భంగా హెలీఫ్యాడ్‌ను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఓఎస్డీ కృష్ణతేజ, కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడి, ఎమ్మెల్యే వేగేశన

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సాయి కల్యాణ చక్రవర్తి

లీగల్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్ ద్వారా తమ కేసులను రాజీ చేసుకు ని.. సత్వర న్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. ఈ నెల 13న జాతీయస్థాయి లోక్ అదా లత్ నిర్వహిస్తున్న సందర్భంగా ఆయన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ హోదాలో మీ డియాతో మాట్లాడారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా జరగనున్న లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను.. పరిష్కరించుకోవచ్చు న్నారు. కక్షిదారులందరూ సమయాన్ని వృథా చేసుకో కుండా త్వరితగతిన కేసులను పరిష్క రించుకోవాలన్నారు.

వాస్తవాలు దాచి ప్రజల్ని తప్పుదోవ పట్టించే కుట్రలు

● వైసీపీ అధ్యక్షుడు జగన్ విమర్శలపై చీఫ్ విప్ జీవీ ధ్వజం

వినుకొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలోని పాపాలను దాచిపెట్టి ప్రజల్ని జగన్ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంపై బురదజల్లుతూ ఏదో జరిగిపోతోందని కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. అమరా వతిని పరుగులు పెట్టిస్తూ, సామాజిక పించన్ల కోసం ఏటా రూ.34 వేల కోట్లు ఖర్చు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం గురించి మాట్లాడే ముందు జగన్ తన ఐదేళ్ల నిర్వాకాలను అద్దంలో చూసుకోవాలన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రైతుల తలసరి అప్పుల్లో ఏపీ మొదటిస్థానంలో నిలిచిందని, ఒక్కో రైతు నెత్తిన రూ.2.43లక్షల చొప్పున అప్పులు ఉన్నట్లు గణాంకాలు రుజువు చేశాయన్నారు. ఆ ఐదేళ్లు రైతు ఆత్మహత్యల్లో ఏపీ దేశంలో 3వ స్థానంలో, కౌలు రైతుల ఆత్మహత్యల్లో 2వ స్థానంలో ఎందుకు నిలిచిందో జగన్ చెప్పాలన్నారు. ఆర్బీకేల గురించి గొప్పగా చెప్పిన జగన్ పాలనలో ధాన్యం కొనుగోళ్లకు కనీసం గోనె సంచులు ఇవ్వని దుస్థితి చూశామన్నారు. 2019లో ఎన్నికలకు ముందు రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని చెప్పి మాట తప్పారని, ఇప్పుడొచ్చి ధరల స్థిరీకరణకు రూ.7వేల కోట్లు ఖర్చు చేసినట్లు నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. అలాగే 17 మెడికల్ కళాశాలలను మొదలు పెట్టామని చెప్పుకుంటున్న జగన్ వాటిని ఎందుకు పూర్తి చేయలేదో వివరించి ఉంటే బాగుండేదన్నారు. చివరకు పులివెందుల మెడికల్ కళాశాలకే ఎన్ఎంసీ గుర్తింపు రాలేదంటే వాటి విషయంలో జగన్ చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చు న్నారు. నాడు ఆగిపోయిన వైద్య కళాశాలలను ఎలాగైనా పూర్తిచే యాలని కూటమి ప్రభుత్వం సంకల్పిస్తే దానిపైనా బురద జల్లడం జగన్‌కే చెల్లిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో వైద్య రంగానికి 4 శాతం బడ్జెట్ కేటాయిస్తే దాన్ని వైసీపీ ప్రభుత్వం ఒక శాతానికి తగ్గించిందన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, సరైన సమయంలో జగన్‌కు సమాధానం చెబుతారన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గ్రామీణ ఆర్థిక వికాసంతోనే.. సుసంపన్న భారత్

● భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి నాగరాజు ● దివంగత శాస్త్రవేత్త నాయుడమ్మ పురస్కారం ప్రదానం

తెనాలి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక రంగంలోనూ శాస్త్ర, సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చామని, డిజిటల్ విధానం మన దేశ ఆర్థిక స్థితినే మార్చివేసిందని.. అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సేవల విభాగం కార్యదర్శి నాగరాజు మద్దిరాల పేర్కొన్నారు. గ్రామీణ భారతావనిని ప్రపంచ దేశాలకు దగ్గర చేయడం ద్వారానే ఇదంతా సాధ్యమైందని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో సుసంపన్న భారత్ లక్ష్యంగా మరిన్ని సంస్కరణలు తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ ఖ్యాతి పొందిన శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ పురస్కార ప్రదాన కార్యక్రమం తెనాలిలో యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ చైర్మన్ రఘునాథబాబు ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని కేంద్ర ఆర్థిక రంగ నిపుణుడు, ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి మద్దిరాల నాగరాజు, అలివేలు మంగతాయారు దంపతులకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రదానోత్సవ సభలో తొలుత నాయుడమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయుడమ్మ డాక్యుమెంటరీ వీడియోను ప్రదర్శించారు. నాయుడమ్మ పురస్కారాన్ని ఇప్పటి వరకు ఎందరో ప్రపంచ మేధావులు, గొప్పవారు అందుకున్నారని.. వారి సరసన తాను నిలవడం గర్వంగా ఉందని అవార్డు గ్రహీత నాగరాజు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలు ఆర్థిక వ్యవస్థకు ప్రాణాధారమని, అవి అభివృద్ధి చెందితే దేశం ఆర్థికంగా ప్రగతి సాధించినట్లేనన్నది ప్రభుత్వ ఆలోచనని ఆయన పేర్కొన్నారు. యూపీఐ భారతీయ ఆర్థిక లావాదేవీల విధానాన్నే పూర్తిగా మార్చివేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాలను ఎంఎస్ఎంఈలకు అనుసంధానం చేయడం వంటివి వికసిత భారత్- 2047కు ముఖ్య పునాదిగా మారాయన్నారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. ప్రజల కోసం పనిచేసే శాస్త్రవేత్తలను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారన్నారు. అటువంటివారిలో యలవర్తి నాయుడమ్మ ఒకరన్నారు. శాస్త్రవేత్తలు సెమినార్లకే పరిమితం కాకుండా జనంలోకి వెళితే, వారి అవసరాలు తెలుస్తాయని అభిప్రాయపడ్డారు. తద్వారా వారికి మేలు చేసే విప్లవాత్మక విధానాలను తీసుకురాగలుగుతారని పేర్కొన్నారు. పురస్కార ప్రదాన సభలో సీఎస్ఐఆర్ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ స్వర్ణ వి.కాంత్, ఫౌండేషన్ వైస్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్యే గోగినేని ఉమ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

జీడీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న జీడీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు, యార్డు చైర్మన్ నీలాల కృష్ణారావు

తాడికొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి రైతుకు యూరియా అందుబాటులో ఉందని గుంటూరు కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వడ్రాణం హరిబాబు చెప్పారు. బుధవారం తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో జీడీసీఎంఎస్ ఆధ్వర్యంలో రైతులకు యూరియా బస్తాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా చాలినంత ఉందని చెప్పారు. రాష్ట్రంలో యూరియా కొరత ఉందని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. సొసైటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా బస్తాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. తాడికొండ శాఖలో డీఏపీ 20 టన్నులు, యూరియా 20 టన్నులు నిల్వలు ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. రైతులను పరామర్శల పేరుతో పంటలను వైసీపీ క్యాడర్ నాశనం చేస్తోందని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని అన్నారు. రాజధాని అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని హరిబాబు తెలిపారు. అనంతరం మంగళగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు తోట కూర శ్రీనివాసరావు మాట్లాడుతూ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా 603 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామని చెప్పారు. యూరియాను అధికంగా వినియోగించటం వల్ల చీడపీడల సమస్య ఎక్కువవుతుందని తెలిపారు. అవసరం మేరకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలని శ్రీనివాసరావు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ నీలాల కృష్ణారావు, తాడికొండ సొసైటీ చైర్మన్ గోగినేని శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్‌నాయక్, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు ఆలపాటి బాలయ్య పాల్గొన్నారు.

పరిశీలన ప్రహసనం

(5వ పేజీ తరువాయి)

ఈడబ్ల్యూఎస్‌కి ఎలా అర్హత పొందుతారనే సమస్య వచ్చింది. దీంతో ఐటీ, రెవెన్యూ అధికారులు ఇచ్చిన సమాచారంతో అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లతో మెగా డీఎస్సీకి దరఖాస్తు చేసిన వారు దాదాపు 100 మందికి పైగా ఉన్నా రు. వీరు ఈడబ్ల్యూఎస్‌కు అర్హులా కాదా అనే తేల్చే పని అధికారులకు కత్తి మీదసాములా మారింది.

నాలుగైదు దఫాలుగా..

దివ్యాంగుల విషయానికి వస్తే కొన్ని సమస్యలు కొలి క్కిరాలేదు. ప్రధానంగా వినికిడి సమస్యతో సర్టిఫికెట్లు పొందిన వారు వాటిని నిర్ధారించుకోలేక పోతున్నారు. దీంతో వారిని సర్టిఫికెట్ల పరిశీలనకు మళ్లీ పిలవాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలన ఇప్పటికే నాలుగైదు దఫాలుగా నిర్వహిం చారు. అయినా ఇంకా మరో పది మంది సర్టిఫికెట్లను నిర్ధారించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఆ యా సమస్యలు పరిష్కరించు కుంటూ నిర్దేశించిన నిబంధనల ప్రకారం సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నారు.

సున్నా వడ్డీ కలేనా?

(5వ పేజీ తరువాయి)

ఇస్తానని చెప్పింది. పథకాన్ని 15 నెలలు ఆలస్యంగా ప్రారంభించి కాలహరణం చేసింది. రెండో విడత ఒక నెల ఆల స్యంగా 2021 అక్టోబరు 7న, మూడో విడత రుణమాఫీని ఆరు నెలల ఆలస్యంగా 2023 మార్చి 25న ప్రారంభించారు. 2024 ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చే వరకూ నాలుగో విడత ఆసరాని ఆపేసి మూడు జిల్లాల్లోని డ్వాక్రా మహిళలకు రూ.699 కోట్లు ఎగవేసింది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (డీఆర్‌డీఏ), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పరిధిలోని డ్వాక్రా సంఘాల్లో విభజిత గుంటూరు జిల్లా లో 29,322 డ్వాక్రా సంఘాలకు చెందిన 2.86 లక్షల మందికి రూ.246 కోట్లు, పల్నాడు జిల్లాలో 25,168 గ్రూపుల్లో 2,47,833 మందికి ఆసరా కింద రూ. రూ.190 కోట్లు, బాపట్ల జిల్లాలో 30,604 గ్రూపులకు గాను.. మూడు లక్షల మందికి రూ. 263 కోట్లు ఆసరా పథకం కింద నాలుగో విడత రుణ మాఫీ జరగాల్సి ఉంది. దాన్ని గత ప్రభుత్వం ఎగవేయడంతో ఆ భారాన్ని మహిళలే మోయాల్సి వస్తోంది. దీనికి తోడు గడిచిన 15 నెలల వడ్డీ కూడా వారిపై పడ డంతో స్వయం సహాయక సంఘాల మహిళలకు అనాసక్తికి గురవుతున్నారు.

స్నేహితుల చేతిలో యువకుడి హత్య

మాచర్ల రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాచర్లలోని శ్రీశైలం రోడ్డులో ఓ యువకుడు తన స్నేహితుల చేతిలో హత్యకు గురయ్యాడు. ఈ ఘటన బుధవారం జరిగింది. పట్టణంలోని 8వ వార్డుకు చెందిన తిరుమలకొండ చంద్రశేఖర్ (30) మంగళవారం తన స్నేహితులతో కలిసి మద్యం సేవించాడు. ఏదో విషయమై వారి మధ్య గొడవ మొదలైంది. ఇది కాస్తా ఒకరిపై ఒకరు దాడి చేసుకునే వరకు వెళ్లింది. చంద్రశేఖర్ స్నేహితులు అతడిపై దాడిచేసి బండరాళ్లతో తలపై మోదడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం అతడి స్నేహితులు అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని చంద్రశేఖర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చంద్రశేఖర్ తల్లి వెంకాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్యచేసిన యువకులను పట్టణ సీఐ ప్రభాకరరావు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మధ్యాహ్న భోజన బియ్యంపై అప్రమత్తంగా ఉండాలి

● లెక్కల్లో తేడాలొస్తే కఠిన చర్యలు తీసుకుంటాం ● హెచ్‌ఎంలకు డైరెక్టర్ హెచ్చరిక

సత్తెనపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిలువ లెక్కల్లో తేడా లొస్తే కఠిన చర్యలు తప్పవని మధ్యాహ్న భోజ న పథకం డైరెక్టర్ బి. శ్రీనివాసరావు ప్రధానోపాధ్యా యులను హెచ్చరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం బియ్యం విషయంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రభుత్వం కిలో రూ.48 విలువైన మంచి బియ్యా న్ని పాఠశాలలకు సరఫరా చేస్తోందని చెప్పారు. ఈ విషయంలో ప్రభు త్వం చిత్తశుద్ధిని పరిగణనలోకి తీసుకొని హెచ్‌ఎంలు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాలల్లో బియ్యం పాత స్టాక్ లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాల న్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, మధ్యా హ్న భోజనం తింటున్న వారి సంఖ్య ఆధారంగా బియ్యాన్ని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. పాఠశా లలో ఎంత మంది విద్యార్థులు భోజనం చేస్తు న్నారన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకొని నెల చివరిలో బియ్యం ఇండెట్ పెట్టాలని, ఆ మేరకు బియ్యం నిల్వలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్‌ను నిర్వహించాలని సూచించారు. పాఠశాలల్లో వచ్చే నెలకు ఎంత మేర బియ్యం అవసరమో ఈ నెల 12 లోగా ఇండెట్ పెట్టాలని హెచ్‌ఎంలకు డైరెక్టర్ ఆదేశించారు.

సంక్షేమానికి పుట్టినిల్లు తెలుగుదేశం పార్టీ

● కనపర్తి శ్రీనివాసరావు ● హాస్టల్‌కు ఫ్యాన్లు అందజేత



ఏఎస్‌డబ్ల్యూకి ఫ్యాను అందజేస్తున్న కనపర్తి

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పుట్టినిల్లు తెలుగుదేశం పార్టీ అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా కనపర్తి జూట్‌మిల్ సమీపంలోని బాలికల సంక్షేమ వసతి గృహానికి ఫ్యాన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో క్రమశిక్షణగా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని విద్యార్థినులకు సూచించారు. విద్యార్థినులు, ఏఎస్‌డబ్ల్యూ అనురాధ కోరిక మేరకు వసతి గృహానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, పఠాన్ అస్మతుల్లా, కరీం పాల్గొన్నారు.

పీడిత ప్రజల కోసం పోరాడిన ఐలమ్మ

● నిమ్మల శేషయ్య



ఐలమ్మకు నివాళి అర్పిస్తున్న శేషయ్య, బీసీ నేతలు

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పీడిత ప్రజల హక్కుల కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని టీడీపీ నాయకుడు నిమ్మల శేషయ్య అన్నారు. ఆమె వర్ధంతి సందర్భంగా గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాకలి ఐలమ్మ సామాజిక న్యాయం, దళిత, బీసీ పీడిత ప్రజల హక్కుల కోసం అజేయమైన పోరాటం చేశారన్నారు. నాటి నిరంకుశ రాజుల పీడనకు తలొగ్గకుండా, సమానత్వం, స్వాభిమానం కోసం ఆమె చేసిన పోరాటం నేటికీ మనకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో కొనిదే మోహన్ గోపికృష్ణ, సత్యం సింగ్, దాసరి జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితో సమస్యలపై పోరాటం : జూపూడి

గుంటూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట నాయకురాలు చిట్యాల ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితో సమస్యలపై పోరాటం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. చంద్రమౌళి నగర్‌లోని పోస్టాఫీసు ఎదురుగా ఉన్న ఐలమ్మ విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్‌సింగ్, సంఘం నాయకులు సాంబయ్య, సురేష్, శ్రీనివాసరావు, ముత్తయ్య, నీలాంబరం తదితరులున్నారు.

● ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు ఐలమ్మ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. పారేపల్లి మహేష్, అశోక్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, వెంకటకోటయ్య తదితరులున్నారు.

దర్శనపు శ్రీనివాస్ ఉన్నత శిఖరాలకు ఎదగాలి

● మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదు

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దళిత నేత దర్శనపు శ్రీనివాస్‌కు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పదవి దక్కడంపై మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం బ్రాడీపేటలో దర్శనపు శ్రీనివాస్‌కు ఆత్మీయ అభినందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, జిల్లాలో సేవారంగ నిపుణులు, టీవీ రావు, సీనియర్ న్యాయవాది దేవరాజన్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డొక్కా మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అవకాశాన్ని శ్రీనివాస్ సద్వినియోగం చేసుకొని ఉన్నతమైన స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. దర్శనపు శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియమాకానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు, రాష్ట్ర, కేంద్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, నాయకులు రవి, దార అంబేడ్కర్, శ్రీనివాస్, రామకృష్ణ, శ్రీనివాస్, సత్యనారాయణ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, హనుమత్ ప్రసాద్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్య వరప్రసాద్ జగన్‌పై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రానికి పట్టిన పీడ జగన్మోహన్ రెడ్డి అని, మోసాలతో అబద్దాలతో బతికే అతడికి సీఎం చంద్రబాబునాయుడుని విమర్శించే హక్కు లేదన్నారు. రైతులు, యూరియా గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలకు సహకరించాలి

● జేసీకి వినతిపత్రం అందజేసిన ఏపీఆర్ఎస్ఏ నాయకులు

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నవంబరు 7, 8, 9 తేదీల్లో జరగనున్న ఏడో రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలకు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నాయకులు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవకు బుధవారం విజ్ఞప్తి చేశారు. ఏపీఆర్ఎస్ఏ జిల్లా నాయకుడు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అసోసియేషన్ నాయకులు జేసీని కలిసి.. అనంతపురంలో జరగబోయే ఈ ఉత్సవాలకు జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగులు హాజరయ్యేందుకు అవసరమైన అనుమతులు ఇప్పించాలని కోరారు. డీఆర్‌వో ఎస్ఎస్‌కే ఖాజావలి, ఏవో పూర్ణచంద్రరావు, అసోసియేషన్ నాయకులు వెంకటరావు, దివ్య, దరియావలి, జి.అనుపమ, అయూబ్, నాగేశ్వరరావు, రామారావు, బాబురావు, లీల, సంధ్యారాణి, త్రిలోక పాల్గొన్నారు.

ఆటో కార్మికుల జీవన స్థితిగతులను మెరుగుపరచాలి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి అరుణ్‌కుమార్ అన్నారు. కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటో డ్రైవర్లు పూర్తిగా ఉపాధి కోల్పోయారన్నారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు మంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రుణభారం, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈనెల15న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.రాంప్రసాదు, ఎండీ బాబర్ పాల్గొన్నారు.

సరుకు రవాణాకు రాయితీ పథకాలు : డీఆర్‌ఎం

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైల్వే ద్వారా సరుకులు రవాణా చేసేందుకు వివిధ రాయితీ పథకాలు ఉన్నాయని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ అన్నారు. బుధవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ యూనిట్ (బీడీయూ) మీటింగ్ డీఆర్‌ఎం అధ్యక్షతన జరిగింది. ఆమె మాట్లాడుతూ సరుకు రవాణలో ఎదురవుతున్న సమస్యల న్నింటినీ పరిష్కరిస్తున్నామన్నారు. సరుకులను వేగంగా, భద్రంగా గమ్యస్థానాలకు చేరుస్తామని చెప్పారు. గూడ్స్ షెడ్లలో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నామన్నారు. వ్యాపారులు రైల్వేకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 26.12 శాతం వృద్ధిని సాధించామని, ఇందుకు సహకరించిన వెండార్లకు ధన్యవాదాలు తెలిపారు. రెడ్డిపాలెంలో ప్రత్యేకంగా కంటైనర్ రైల్ టెర్మినల్‌ని ఏర్పాటు చేస్తామన్నారు. ఏడీఆర్‌ఎం రమేష్‌కుమార్, సీనియర్ డీసీఎం సీహెచ్ ప్రదీప్‌కుమార్, సీనియర్ డీవోఎం జె.శ్రీనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

22 నుంచి కన్యకా పరమేశ్వరి నవరాత్రి మహోత్సవాలు

గుంటూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏటుకూరు రోడ్డులోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఈ నెల 22 నుంచి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ కోట వెంకటశివ శేషగిరిరావు తెలిపారు. దేవస్థానంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో నవరాత్రులకు సంబంధించిన బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవ కమిటీ కన్వీనర్లు కారంశెట్టి లోకేష్‌గుప్తా, కాకుమాను శ్రీనివాసరావు, జూలూరి హేమానంద్ గుప్తా, కూనిశెట్టి చంద్రశేఖర్, గౌరవ సలహాదారులు కొనకళ్ళ సత్యం, కొత్తూరు వెంకట్, వనామ నరేంద్ర, చామచర్తి ఆనంద్‌సాగర్, సముద్రాల గణేష్ తదితరులున్నారు.

తురకపాలెం ఘటనపై ఎన్‌సీడీసీ విశ్లేషణ

● త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక
● అనుమానిత లక్షణాలతో ఆస్పత్రిలో ఉన్న ఇద్దరికి నెగెటివ్
● రక్త నమూనాల్లో అసాధారణ ఫలితాలు వచ్చిన వారికి వైద్య సేవలు

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో బుధవారం జాతీయ వ్యాధుల నియంత్రణ కేంద్రం(ఎన్‌సీడీసీ) సంయుక్త సంచాలకులు డాక్టర్ హేమలత, డాక్టర్ ప్రవీణ్ నేతృత్వంలోని నిపుణుల బృందం సందర్శన కొనసాగుతోంది. వ్యాధి కారణాలపై విశ్లేషణ జరుగుతుందని, నివేదికను త్వరలో ప్రభుత్వానికి అందించనున్నారని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామంలో వైద్యసేవలు, పారిశుద్ధ్యం తదితర అంశాలను ఆమె వెల్లడించారు.

● గుంటూరు మెడికల్ కళాశాలలోని ఎస్‌పీఎం బృందం, ప్రైవేటు ఆస్పత్రులలోని ఇన్ఫెక్షస్ వ్యాధుల నిపుణులు రోగుల కేస్ షీట్‌లను పరిశీలిస్తున్నారు. మరణాలకు కారణాలపై నివేదిక రెండు రోజుల్లో అందుబాటులోకి రానుంది. గ్రామంలో ఇప్పటి వరకు పరీక్షించిన 84 బ్లడ్ కల్చర్ నమూనాల్లో 64 (84%) నెగెటివ్‌గా తేలాయి. మిగిలిన ఫలితాలు 24 గంటల్లో వస్తాయి. గ్రామానికి సంబంధించిన డయాగ్నస్టిక్స్ ఫలితాలను కళాశాల బృందం సమీక్షిస్తోంది.

● గుంటూరు సమగ్ర ఆసుపత్రి నిపుణులు రక్త నమూనాల పరీక్షల్లో అసాధారణ నివేదికలు ఉన్న రోగులకు ఓపీ సెషన్లు నిర్వహించి, మందులు సూచించడంతో పాటు మరింత స్కానింగ్‌లకు మార్గనిర్దేశం చేశారు. గ్రామంలో వైద్యారోగ్య శాఖ బృందాలు 56 గృహాలను సందర్శించి అవగాహన కల్పించి, మందులు అందిస్తున్నారు.

● గ్రామ వీధుల్లో ఐఈసీ కార్యక్రమాల పరిశుభ్రత, సురక్షిత ఆహార అలవాట్లపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. వైద్యారోగ్య శాఖ రాష్ట్ర స్థాయి నిపుణుల కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎ.సిరి ఆధ్వర్యంలో గ్రామ ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారన్నారు.

● ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు ఇళ్లను సందర్శించి ఎపిడెమిక్ కంట్రోల్ చర్యలను కొనసాగిస్తున్నారన్నారు.

● గ్రామంలో గత నెల 21 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు వరకు నమోదైన మెలియోడోసిస్ అనుమానిత కేసుల్లో ఇప్పటి వరకు ఇద్దరికి నిర్ధారణ అయ్యిందని, మిగిలిన ఐదుగురిలో ఇద్దరికి నెగటివ్ ఫలితాలు రావటంతో డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్న ఐదుగురి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందన్నారు.

● జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో పదిమంది మున్సిపల్ శానిటరీ కార్మికులు, సూపర్‌వైజర్ పర్యవేక్షణలో పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగాయన్నారు.

● ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో 4 వేల లీటర్ల సామర్థ్యం గల 26 ట్యాంకర్లు, 12 వేల లీటర్ల సామర్థ్యం గల 4 ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారన్నారు. గ్రామస్థులకు అదనంగా 650 వాటర్ బబుల్స్ అల్పాహారం, భోజనం అందించినట్లు తెలిపారు.

అట్టహాసంగా ఎమ్మెల్యే ఆనందబాబు జన్మదిన వేడుకలు



వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న పంచుమర్తి భూపతిరావు



ఆనందబాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న బత్తుల హరిదాసు

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు జన్మదిన వేడుకలు బుధవారం గుంటూరు లోని ఆయన క్యాంపు కార్యాలయంలో అట్టహాసంగా జరిగాయి. భారీ సంఖ్యలో తరలి వచ్చిన పార్టీ, కూటమి నేతలు, శ్రేణుల సమక్షంలో ఆయన కుటుంబసభ్యులతో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత పంచుమర్తి భూపతిరావు, ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరే షన్ డైరెక్టర్ బత్తుల హరిదాసు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, పాటిబండ్ల విష్ణువర్ధన్, కన్నధార వెంకటేశ్వరరావు, సరిపూడి అనిల్, మల్లంపాటి రాధాకృష్ణమూర్తి సహా పలువురు నేతలు ఆనందబాబుకు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్త లు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు పుష్పగుచ్ఛాలు అంద జేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నక్కా ఆనందబాబు రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని, బడుగు, బలహీన వర్గాలకు మెరుగైన సేవలు అందించాలని నేతలు, అభిమానులు ఈ సందర్భంగా ఆకాంక్షిం చారు. ఆనందబాబు మాట్లాడుతూ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు జన్మదినం సందర్భంగా బ్రాడీపేట, షిరిడీ సాయి దీనజనసేవాసమితి ఆశ్రమంలో టీడీపీ నాయకుడు కొర్రపాటి సురేష్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించి, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్, కూటమి నాయకులు నక్కా ఆకాష్, దారా అంబేడ్కర్, కొర్రపాటి సురేష్, మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్, కోపూరి లక్ష్మీ, జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీకి త్వరలో నూతన సీఈవో

● ఇప్పటికే నియామక ప్రక్రియ చేపట్టిన ఆప్కాబ్

గుంటూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు త్వరలో కొత్త సీఈవో రానున్నారు. ఈ మేరకు నియామకపు ప్రక్రియను ఆప్కాబ్ ఉన్నతాధికారులు చేపట్టారు. ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. త్వరలోనే ఫలితాలను విడుదల చేసి నూతన సీఈవోను ప్రకటించనున్నట్లు బ్యాంకు వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం తాత్కాలిక సీఈవోగా సీహెచ్ అజయ్‌కిషోర్ వ్యవహరిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో డీసీసీబీ సీఈవోగా కృష్ణవేణి వ్యవహరించారు. కూటమి వచ్చాక డీసీసీబీ చైర్మన్‌గా మక్కెన మల్లికార్జునరావు నియామకం కావడంతో కృష్ణవేణిని తప్పించి.. ఇన్‌చార్జి బాధ్యతలను అజయ్‌కిషోర్‌కు అప్పగించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బ్యాంకులో జరిగిన కోట్లాది రూపాయల కుంభకోణంపై దర్యాప్తు జరుపుతున్నామని గతంలో చైర్మన్ తెలిపారు.



ప్రసంగిస్తున్న చైర్మన్ వెంకటయ్య, వేదికపై మాజీ మంత్రి మాణిక్యవరప్రసాద్

దళితుల తిరుగుబాటుతోనే ఎస్సీ, ఎస్టీ రక్షణ చట్టం

● తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

గుంటూరు,సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): గతంలో ఉమ్మడి రాష్ట్రంలో చుండూరు, కారంచేడు, నీరుకొండలో జరిగిన మారణ హోమంపై దళితుల తిరుగుబాటుతోనే ఎస్సీ, ఎస్టీ రక్షణ చట్టం అమల్లోకి వచ్చిందని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ అధ్యక్షతన చుండూరు పల్లె వీరుడు కొమ్మెర్ల అనీల్ కుమార్ 34వ సంస్మరణ సభను పల్లెవీరుల మహోత్సవంగా బుధవారం బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ కారంచేడు, చుండూరు, నీరుకొండలోని మారణహోమాలను చూసి అప్పట్లో తాను కన్నీటి పర్యంతమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని విషయాల్లో దళితులకు కాపరిగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ పనిచేస్తుందన్నారు. తెలంగాణ సమాజంలో రెండు గ్లాసుల విధానం రద్దు చేయగలిగామన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ దేశంలో అందరికి సమాన న్యాయం లేనందునే అణగారిన వర్గాలపై దారుణాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ నాయకులు మేళం భాగ్యారావు, జాతీయ కార్యదర్శి పి శంకర్, హైకోర్టు జీపీ తాటిపర్తి బాలస్వామి, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి శాంతకుమారి, ఏసీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గురవయ్య, రిటైర్డ్ డీఎస్పీ కె.రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ శ్లాబులు తగ్గించినందుకు బీజేపీ జిల్లా నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్ర పటానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు ఆధ్వర్యంలో బ్రాడీపేట 4వ లైనులో జీఎస్టీ శ్లాబుల తగ్గింపు, ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణ విజయోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధి కార ప్రతినిధి దర్శనం శ్రీనివాస్, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్ యాదవ్, ఈదర శ్రీనివాస్ రెడ్డి, పాలపాటి రవికుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, చరక కుమార్ గౌడ్, వైవీ సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, శ్రీనివాసరావు, తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అఖిల భారత వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మహేష్‌బాబు

గుంటూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): అఖిల భారత వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నగరానికి చెందిన పల్లపు మహేష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు విజయవాడలోని ఐలాపురం హోటల్లో జరిగిన కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్ చేతుల మీదుగా మహేష్‌బాబు నియామకపు ఉత్తర్వులు అందుకున్నారు. సంఘం నాయకులు గుంజు శ్రీను, తిరుమలదేవి పాల్గొన్నారు.

విజయలక్ష్మికి గ్లోబల్ ఎక్స్‌లెన్స్ అవార్డు

గుంటూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన కీర్తన ట్రస్ట్ అధ్యక్షురాలు మేరిగ విజయలక్ష్మి బ్యాంకాక్ సంస్థ గ్లోబల్ ఎక్స్‌లెన్స్ అవార్డు ఫర్ సోషల్ వర్క్‌కు ఎంపికయ్యారు. ప్లాస్టిక్‌ను నిషేధంపై విస్తృతంగా ప్రచారం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా వేలాది మొక్కలు నాటారు. ఈనెల 13న థాయ్‌లాండ్‌లో అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు.

బీసీల నిరసన ర్యాలీ విజయవంతం చేయాలి

● ఏపీ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ క్రాంతికుమార్

గుంటూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు, కుల గణన, రక్షణ చట్టం అమలు చేయాలన్న డిమాండ్లతో శుక్రవారం గుంటూరులో నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ తెలిపారు. చుట్టుగుంట సెంటర్‌లోని కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందూ కళాశాల సెంటర్‌లోని మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంఘం నాయకులు నాగమల్లేశ్వరరావు, మహేష్, అశోక్, పూర్ణ, భాస్కర్ తదితరులున్నారు.

స్వదేశీ వస్త్రాలను ఆదరించాలి : డిప్యూటీ మేయర్

గుంటూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహిళల వైభవానికి పట్టు వస్త్రాలు ప్రత్యేక ముద్ర వేసుకున్నాయని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ షేక్ సజీల తెలిపారు. దేశంలోనే ఎంతో మంది కళాకారులు రూపొందించిన పట్టు వస్త్రాలకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో వేదికగా.. ఉత్పత్తిదారులే నేరుగా అమ్మకాలు నిర్వహించడంతో బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకు పట్టు వస్త్రాలు అందుబాటులోకి వస్తాయన్నారు. కేంద్ర చేనేత, జౌళిశాఖ సహకారంతో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్లో ఐదు రోజుల ఇండియన్ సిల్క్ ఎక్స్‌పోను బుధవారం డిప్యూటీ మేయర్ షేక్ సజీల ప్రారంభించారు. పట్టు వస్త్రాల స్టాల్స్‌ను తిలకించారు.

అత్యవసరమే..ఆమె ఆయుధం

● ఇప్పుడే ఇస్తానని డబ్బు, బంగారం తీసుకుంటుంది
● తిరిగివ్వమని అడిగితే..బెదిరింపులు, దాడులకు యత్నం
● వాసిరెడ్డి ప్రసన్న రాధికపై బాధిత మహిళల ఫిర్యాదు

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు మహిళనంటూ పరిచయాలు పెంచుకుంది. అత్యవసరం అంటూ పలువురు మహిళల నుంచి బంగారం, నగదు తీసుకుంది. తిరిగివ్వమని అడిగితే బాధితులను బెదిరిస్తోంది. తనపై హత్యాయత్నానికి కూడా పాల్పడినట్లు మరో మహిళ వాపోయింది. బాధిత మహిళలందరూ కలిసి బుధవారం గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్ కుమార్‌ను కలిసి న్యాయం చేయాలంటూ వేడుకున్నారు. వాసిరెడ్డి ప్రసన్న రాధిక అనే మహిళపై.. నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మెట్ల ఉమాదేవి, రాయుడు శ్రీలక్ష్మి, నేపాక పద్మావతి, పి.మల్లేశ్వరి, గిరిజ తదితర మహిళలు ఐజీ, ఎస్పీ సతీష్ కుమార్‌కు సమస్యను వివరించారు. తెలుగు మహిళ నాయకురాలు, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ చైర్మన్, ఏపీ అంగన్వాడీ, డ్వాక్రా సాధికారిక కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని అంటూ పలకలూరు రోడ్డుకు చెందిన ప్రసన్న రాధిక అరాచకాలు, అక్రమ వసూళ్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. మెట్ల ఉమాదేవి మాట్లాడుతూ.. రాధికతో తనకు నాలుగేళ్ల పరిచయం ఉందన్నారు. అత్యవసరమంటూ రూ.11.50 లక్షలు, దీనికి ముందు ఫంక్షన్‌కు వెళ్లాలని 20 సవర్ల బంగారం తీసుకుందని తెలిపారు. నగదు, బంగారం తిరిగివ్వలేదని, దీనిపై రాధికను నిలదీయగా బెదిరింపులకు పాల్పడడమే కాకుండా.. తనపై హత్యాయత్నం చేయించిందని వాపోయింది.

పదుల్లో బాధితులు.. లక్షల్లో మోసం

తెలుగు మహిళా నాయకురాలినని పరిచయాలు పెంచుకొని అత్యవసరమంటూ తమ వద్ద నుంచి డబ్బులు తీసుకున్నట్లు బాధిత మహిళలు ఫిర్యాదు చేశారు. వంట పనిచేసే తమ వద్ద రూ.8 లక్షల నగదు, 6 సవర్ల బంగారు ఆభరణాలు తీసుకుందని శైలాభి, శ్రీనివాస్ దంపతులు, కుమారుడిని పైచదువులకని రూ.5 లక్షలు తీసుకుందని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నేపాక పద్మావతి, అత్యవసరమని రూ.6 లక్షలు తీసుకుందని పి.మల్లేశ్వరి , బెంగళూరులో విల్లా కొనుగోలు చేస్తున్నానని రూ. 46 లక్షలు తీసుకుందని శ్రీలక్ష్మీ, రూ.35 వేలు తీసుకుందంటూ.. గిరిజ అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే.. ఫైనాన్స్ వ్యాపారం చేద్దామని తెనాలికి చెందిన మహిళతో రూ.70లక్షలు తాకట్టు పెట్టించిందని ఇలా.. మరో 50 మంది వరకు బాధితులు ఉన్నట్లు చెబుతున్నారు. ఫిర్యాదుపై స్పందించిన ఐజీ త్రిపాఠి చర్యలు తీసుకోవాలని ఎస్పీని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై విచారణ జరుపుతున్నామని, చర్యలు తీసుకుంటామని బాధిత మహిళలకు ఎస్పీ సతీష్‌కుమార్ హామీ ఇచ్చారు.

స్థానిక పత్రిక ఎడిటర్‌పై కేసు

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీసే విధంగా కథనాలు రాస్తున్న ఓ స్థానిక పత్రిక ఎడిటర్‌పై పట్టాభిపురం పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. రేంజ్ ఐజీని ఉద్దేశించి ఆన్‌లైన్ ఎడిషన్‌లో ప్రచురితమైన కథనంపై పోలీసు అధికారుల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. సంఘం జిల్లా అధ్యక్షుడు, అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎడిటర్ బండి సురేంద్రబాబుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు ఇళ్లపై పూర్తి హక్కులు కల్పిస్తున్నాం

● ఎమ్మెల్యే నసీర్



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): జీవో నంబర్ 30 పేదలకు వరమని, ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇళ్లపై హక్కులు కల్పిస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. జీవో నెంబర్ 30పై అవగాహన కల్పించేందుకు బుధవారం ప్రగతి నగర్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్ద కాలం పాటు నివాసాలుంటున్న పేదలు తమ ఇళ్లపై హక్కులు పొందబోతున్నారని, ఇదంతా సీఎం చంద్రబాబునాయుడు మంచి మనసుకు నిదర్శనమని చెప్పారు. ప్రగతినగర్, యానాది కాలనీలో సుమారు 1300 ఇళ్లకు పైగా క్రమబద్ధీకరణ చేయబోతున్నామని వెల్లడించారు. దీనికి సంబంధించి దరఖాస్తు ఫీజు ఒక్కొక్కటి 50 రూపాయలను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందన్నారు. అయితే ఆ రుసుమును తానే భరిస్తానని ఈ సందర్భంగా పేదలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యాల్లావుల అశోక్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

తవ్విన మట్టిని ఎప్పటికప్పుడు తొలగించాలి

● కమిషనర్ శ్రీనివాసులు



బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): శంకర్ విలాస్ ఆర్వోబీ పియర్స్ (పిల్లర్స్) నిర్మాణం కోసం తవ్విన మట్టిని ఎప్పటికప్పుడు ప్రజలకు ఇబ్బంది లేకుండా తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మాణంలో ఉన్న శంకర్ విలాస్ ఆర్వోబీ పనులను అధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. సిటీ ప్లానర్ రాంబాబు, ఏసీపీ రెహమాన్, ఆర్‌అండ్‌బీ డీఈఈ చెన్నయ్య, జేఈఈ సాయి కృష్ణ, సైట్ ఇంజనీర్ సుధీర్ సిబ్బంది పాల్గొన్నారు.

పనుల్లో ప్రమాణాలు పాటించాలి

గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో జరిగే అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించ డంతోపాటు నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయాలని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బృందావన్ గార్డెన్స్, పెదపలకలూరు రోడ్డు, నెహ్రూనగర్ ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

అమ్మాయిలు..అదే జోరు

సూపర్-4లో కొరియాపై భారత్ గెలుపు

ఆసియా కప్ హాకీ



హంగ్జౌ (చైనా): మహిళల ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత హాకీ జట్టు జోరు కొనసాగుతోంది. టోర్నీలో ఒక్క ఓటమి కూడా కూడా లేకుండా గ్రూప్ దశను టాపర్‌గా ముగించిన మన అమ్మాయిల బృందం.. సూపర్-4లోనూ అంతేదీటుగా విజృంభిస్తోంది. బుధవారం జరిగిన సూపర్-4 తొలి పోరులో భారత్ 4-2తో కొరియాను చిత్తు చేసింది. భారత జట్టులో వైష్ణవి (2వ), సంగీతా కుమారి (33వ), లాల్‌రెమ్సియామి (40వ), రుతుజ (59వ) తలో గోల్ సాధించారు. కొరియా తరపున యుజిన్ కిమ్ (33వ, 53వ) రెండు గోల్స్ చేసింది. భారత్ తమ రెండో మ్యాచ్‌ను గురువారం చైనాతో ఆడనుంది. నాలుగు జట్లు తలపడే సూపర్-4లో తొలి రెండుస్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్ చేరతాయి.

అన్‌సీడెడ్ చేతిలో..

- సింధు పరాజయం
- ప్రణయ్, సేన్ ముందంజ
- హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధుకు హాంకాంగ్ ఓపెన్‌లో చుక్కెదురైంది. ఈ భారత స్టార్ అనూహ్యంగా ఆదిలోనే అన్‌సీడెడ్ చేతిలో పరాజయం పాలై నిరాశపరచింది. డెన్మార్క్‌కు చెందిన క్రిస్టోఫర్సెన్ 15-21, 21-16, 21-19తో సింధుకు షాకిచ్చి ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 22-20, 16-21, 21-15తో తైపీ ఆటగాడు వాంగ్ జూ వీపై, ప్రణయ్ 21-17, 21-14తో చైనా షట్లర్ లూ గువాంగ జూపై, ఆయుష్ శెట్టి 15-21, 21-19, 21-13తో సూ లి యాంగ్ (తైపీ)పై, కిరణ్ జార్జ్ 21-16, 21-11తో జియా హెంగ్ జాసన్ తె (సింగపూర్)పై గెలిచి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. మహిళల డబుల్స్‌లో రీతుపర్ణ పండా/శ్వేతపర్ణ పండా జోడీ 21-17, 21-9తో స్థానిక జంట వానెస్సా పాంగ్/సమ్ యూ వాంగ్‌పై గెలిచి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించింది. సింగిల్స్‌లో రక్షిత రామరాజు, అనుపమ ఉపాధ్యాయ, మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా/ధ్రువ్ కపిల, రుత్వికా శివాని/రోహన్ కపూర్ ద్వయం జోడీలు ప్రత్యర్థుల చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించారు.

బిష్ణోయ్‌కు 6, అర్ష్‌దీప్‌నకు 10

దుబాయ్: టీమిండియా బౌలర్లు రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో చెరోస్థానం మెరుగుపర్చుకుని ముందంజ వేశారు. వీరు వరుసగా 6, 10వ ర్యాంకుల్లో నిలిచారు. వరుణ్ చక్రవర్తి 4వ ర్యాంక్‌ను నిలబెట్టుకొని భారత్ తరపున టాప్ బౌలర్‌గా కొనసాగుతున్నాడు. బ్యాటర్ల జాబితాలో అభిషేక్ శర్మ నెంబర్‌వన్ ర్యాంక్‌ను పదిలం చేసుకున్నాడు.

27 బంతుల్లోనే..

భారత్ సునాయాస విజయం

యూఏఈ 57 ఆలౌట్

కుల్దీప్‌కు 4, దూబేకి 3 వికెట్లు



దుబాయ్: డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగిన టీమిండియా.. ఆసియా కప్‌లో ఘనంగా బోణీ చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ కుల్దీప్ యాదవ్ (4/7), శివం దూబే (3/4) తిప్పేయడంతో.. గ్రూప్-ఎలో బుధవారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో యూఏఈని చిత్తు చేసింది. 79 బంతుల్లోనే ప్రత్యర్థిని ఆలౌట్ చేసిన టీమిండియా.. కేవలం 27 బంతుల్లోనే లక్ష్యాన్ని ఊదేసింది. దీంతో మొత్తం 106 బంతుల్లోనే మ్యాచ్ ముగిసింది. తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ 13.1 ఓవర్లలో 57 పరుగులకే కుప్పకూలింది. అలీషాన్ షరాఫు (22), మహ్మద్ వసీం (19) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. శివం దూబే మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో భారత్ 4.3 ఓవర్లలో 60/1 స్కోరు చేసి గెలిచింది. అభిషేక్ శర్మ (30), శుభ్‌మన్ గిల్ (20 నాటౌట్) రాణించారు. జునైద్ ఒక వికెట్ దక్కించుకొన్నాడు.

అలవోకగా..: స్వల్ప లక్ష్య ఛేదనలో ఓపెనర్లు అభిషేక్, గిల్ ప్రత్యర్థి బౌలింగ్‌ను ఉతికి ఆరేశారు. తొలి బంతినే సిక్స్‌కు తరలించిన శర్మ.. రెండో బంతికి బౌండ్రీ సాధించాడు. రెండో ఓవర్‌లో రోహిద్ బౌలింగ్‌లో గిల్ 4,6తో 15 పరుగులు రాబట్టడంతో స్కోరు బోర్డు దూసుకెళ్లింది. మరో రెండు సిక్స్‌లు, ఫోర్ కొట్టిన అభిషేక్‌ను జునైద్ క్యాచవుట్ చేయడంతో.. తొలి వికెట్‌కు 48 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. విజయానికి 10 పరుగులు కావల్సి ఉండగా.. వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ (7 నాటౌట్) ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్‌గా మలిచాడు. మరో వైపు బౌండ్రీతో మ్యాచ్‌ను ఫినిష్ చేసిన గిల్.. మరో 93 బంతులు మిగిలుండగానే జట్టుకు ఘన విజయం అందించాడు.

పెవిలియన్‌కు క్యూ..: పవర్‌ప్లేలో పర్వాలేదనిపించినా.. కుల్దీప్ స్పిన్ ఉచ్చులో చిక్కుకొన్న యూఏఈ బ్యాటింగ్ పేకమేడలా కూలింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యూఏఈకి ఓపెనర్ అలీషాన్ మెరుగైన ఆరంభాన్నే ఇచ్చాడు. పాండ్యా వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో రెండు బౌండ్రీలు బాదాడు. బుమ్రా బౌలింగ్‌లో ఫోర్ కొట్టిన షరాఫు.. అక్షర్ వేసిన మూడో ఓవర్‌లో సిక్స్‌తో బ్యాట్ ఝుళిపించాడు. కానీ, ఆ తర్వాతి ఓవర్‌లో బుమ్రా యార్కర్‌కు అలీషాన్ పెవిలియన్ చేరాడు. దీంతో తొలి వికెట్‌కు 26 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్ బ్యాటర్ జొహైబ్ (2)ను వరుణ్ క్యాచవుట్ చేశాడు. కానీ, ఆరో ఓవర్‌లో బుమ్రా బౌలింగ్‌లో వసీం మూడు బౌండ్రీలతో 12 పరుగులు రాబట్టడంతో.. పవర్‌ప్లేను యూఏఈ 41/2తో ముగించింది. అయితే, మధ్య ఓవర్లలో కుల్దీప్ మాయాజాలంతో ఒక్కసారిగా కుదేలైంది. 8వ ఓవర్‌లో రాహుల్ చోప్రా (3), వసీంతోపాటు హర్షిత్ కౌశిక్ (2)ను కుల్దీప్ అవుట్ చేయడంతో.. యూఏఈ 50/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆసిఫ్ ఖాన్ (2), ధ్రువ్ (1), జునైద్ సిద్దిఖీ (0)ను దూబే పెవిలియన్ చేర్చాడు. హైదర్ అలీ (1)ను క్యాచవుట్ చేసిన కుల్దీప్.. యూఏఈ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

ఆసియా కప్‌లో నేడు

బంగ్లాదేశ్ x హాంకాంగ్

రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

స్కోరుబోర్డు

యూఏఈ: అలిషన్ షరాఫు (బి) బుమ్రా 22, మహ్మద్ వసీమ్ (ఎల్బీ) కుల్దీప్ 19, జొహైబ్ (సి) కుల్దీప్ (బి) వరుణ్ 2, రాహుల్ చోప్రా (సి) గిల్ (బి) కుల్దీప్ 3, ఆసిఫ్ (సి) శాంసన్ (బి) దూబే 2, హర్షిత్ (బి) కుల్దీప్ 2, ధ్రువ్ పరాషర్ (ఎల్బీ) దూబే 1, సిమ్రన్‌జీత్ (ఎల్బీ) అక్షర్ 1, హైదర్ (సి) శాంసన్ (బి) కుల్దీప్ 1, సిద్దిఖీ (సి) సూర్య (బి) దూబే 0, మహ్మద్ రోహిద్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 13.1 ఓవర్లలో 57 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-26, 2-29, 3-47, 4-48, 5-50, 6-51, 7-52, 8-54, 9-55, 10-57; **బౌలింగ్:** హార్దిక్ 1-0-10-0, బుమ్రా 3-0-19-1, అక్షర్ 3-0-13-1, వరుణ్ చక్రవర్తి 2-0-4-1, కుల్దీప్ 2.1-0-7-4, శివమ్ దూబే 2-0-4-3.

భారత్: అభిషేక్ (సి) హైదర్ (బి) సిద్దిఖీ 30, గిల్ (నాటౌట్) 20, సూర్యకుమార్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 3, మొత్తం: 4.3 ఓవర్లలో 60/1; వికెట్ పతనం:** 1-48; **బౌలింగ్:** హైదర్ 1-0-10-0, రోహిద్ 1-0-15-0, పరాషర్ 1-0-13-0, సిద్దిఖీ 1-0-16-1, సిమ్రన్‌జీత్ సింగ్ 0.3-0-6-0.

1

4.3 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించిన భారత్.. టీ20ల్లో తన వేగవంతమైన ఛేదనను నమోదు చేసింది. గతంలో స్కాట్లాండ్‌పై 6.3 ఓవర్లలోనే ఛేదించిన రికార్డును టీమిండియా ఈ మ్యాచ్‌లో తిరగరాసింది.

టైటాన్స్ హ్యాట్రిక్

ముంబాపై గెలుపు ● ప్రొ కబడ్డీ



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్ విశాఖపట్నం అంచెను తెలుగు టైటాన్స్ హ్యాట్రిక్ విజయంతో ముగించింది. బుధవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 45-37 స్కోరుతో యు ముంబాను చిత్తుచేసింది. టైటాన్స్ రైడర్లు, డిఫెండర్లు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. తొలి భాగంలో టైటాన్స్‌ను ముంబా ఆటగాళ్లు నిలువరించలేకపోయారు. దీంతో ప్రథమార్ధం 27-11తో ముగిసింది. ద్వితీయార్థంలో తెలుగు టైటాన్స్ ఆటగాళ్లు అదే జోరు కొనసాగించి మరోసారి యు ముంబాను ఆలౌట్ చేసి సురక్షితమైన ఆధిక్యాన్ని సాధించారు. టైటాన్స్ దాటికి ఒత్తిడికి గురైన ముంబా వరుస లైనౌట్‌లతో పాయింట్లు సమర్పించుకుంది. చివరి నిమిషాలలో అనూహ్యంగా పుంజుకున్న ముంబా ఆటగాళ్లు టైటాన్స్‌ను ఆలౌట్ చేసినా ఫలితం లేకపోయింది. టైటాన్స్‌లో రైడర్ భరత్ 13 పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించగా, యు ముంబాలో సందీప్‌కుమార్, అమి మహ్మద్ జఫర్ దనేష్ చెరో ఏడు పాయింట్లు రాబట్టారు. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 43-32తో యూపీ యోధాస్‌ను ఓడించింది.

నిఖత్‌కు నిరాశ

క్వార్టర్స్‌లో ఓటమి

సెమీఫైనల్‌కు నూపుర్, జాస్మిన్

భారత్‌కు రెండు పతకాలు ఖరారు

ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్





లివర్‌పూల్ (ఇంగ్లండ్): తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్‌కు ప్రతిష్ఠాత్మక వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మూడో టైటిల్ మిస్సయింది. డబుల్ డిఫెండింగ్ చాంపియన్ నిఖత్ పోరాటం ఈసారి క్వార్టర్‌ఫైనల్‌కే పరిమితమైంది. గతసారి (2023) 50 కిలోలు, అంతకుముందు (2022) 52 కిలోల విభాగాలలో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన నిఖత్ ఈసారి 51 కిలోల బరిలో దిగింది. అయితే బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జరీన్ 0-5తో రెండుసార్లు ఒలింపిక్ రజత పతక విజేత బ్యూస్ నాజ్ కకిరోగ్లు (తుర్కియే) చేతిలో చిత్తయింది. దాంతో టోర్నీ నుంచి నిఖత్ రిక్తహస్తాలతో వెనుదిరిగింది. అయితే, నిఖత్ నిరాశపరిచినా.. హరియాణా బాక్సర్లు నూపుర్ షెరాన్, జాస్మిన్ లంబోరియా తమ విభాగాల్లో సత్తా చాటి భారత్‌కు రెండు పతకాలు ఖాయం చేశారు. మహిళల 80+ కేజీల విభాగంలో నూపుర్, 57 కిలోల కేటగిరిలో జాస్మిన్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. దిగ్గజ బాక్సర్ హవా సింగ్ మనుమరాలైన 26 ఏళ్ల నూపుర్ క్వార్టర్‌ఫైనల్లో 4-1తో ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ఒల్టినోయ్ సొతింబేవను చిత్తు చేసింది. మరో క్వార్టర్స్ బౌట్‌లో జాస్మిన్ 5-0తో ఉజ్బెకిస్థాన్ బాక్సర్ ఖుమోరాబోను మమజొనొవాటపై గెలిచింది. సెమీఫైనల్స్‌లో ఓడినా వీళ్లకు కాంస్య పతకాలు దక్కుతాయి. ఇక..పురుషుల కేటగిరీలో జాదుమని సింగ్ (48 కి), అభినాష్ జమ్వాల్ (65 కి) క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టి పతకానికి ఒక్క విజయం దూరంలో నిలిచారు. కాగా, మరో భారత బాక్సర్ జుగ్నూ అహ్లావత్ (85 కి) తొలి రౌండ్ పరాజయంతో టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాడు.

భారత్-పాక్ మ్యాచ్‌కు తగ్గిన డిమాండ్!

పూర్తిగా అమ్ముడుపోని టికెట్లు

దుబాయ్: చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ అంటే టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడుపోతాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఈ రెండు జట్లు తొలిసారిగా తలపడనుండడంతో.. డిమాండ్ భారీగా ఉంటుందని అంచనా వేశారు. కానీ, ఆసియాకప్‌లో ఆదివారం జరిగే ఇండో-పాక్ మ్యాచ్ టికెట్లు ఇంకా అందుబాటులో ఉండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. హైవోల్టేజ్ మ్యాచ్‌కు డిమాండ్ తగ్గడానికి అధిక ధరలే కారణమని తెలుస్తోంది. రెండు సీట్లకు రూ. 10,000 అన్నింటికంటే తక్కువ. వీఐపీ రాయల్ బాక్స్‌లో జతకు రూ. 2,30,700, స్కైబాక్స్ టికెట్ రూ. 1,67,851గా నిర్ణయించారు. ప్లాటినం రూ. 75,658, గ్రాండ్ లాంజ్ రూ. 41,153 లాంటి మధ్య శ్రేణి టికెట్లు కూడా సగటు ప్రేక్షకుడికి అందుబాటులో లేవు.

తుపాకీ గురిపెట్టి..క్రికెటర్ల దోపిడీ

బార్బడోస్‌లో ఘటన

బార్బడోస్: కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో సెయింట్ కిట్స్, నెవిస్ పాట్రియాట్స్ జట్టు ఆటగాళ్లు దోపిడీకి గురయ్యారు. ఆ క్రికెటర్లు, సీపీఎల్ అధికారి ఒకరు ఓ ప్రయివేట్ ఈవెంట్‌ను ముగించుకొని మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో హోటల్‌కు వెళుతూ మర్గమధ్యంలో ఆహారంకోసం ఒకచోట ఆగారు. ఆ సమయంలో కొందరు దొంగలు.. క్రికెటర్లు, ఆ అధికారిని తుపాకీతో బెదిరించి నగలు, ఇతర విలువైన వస్తువులు దోచుకొన్నారు. ఈక్రమంలో క్రికెటర్లు దొంగలను ప్రతిఘటించగా వారి మధ్య పెనుగులాట జరిగింది. పెనుగులాటలో దొంగలు ఓ తుపాకీని అక్కడే వదిలేసి పరారయ్యారు. ఈ ఘటనలో క్రికెటర్లు సురక్షితంగా ఉన్నారని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలి నుంచి పోలీసులు ఓ తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.

మస్క్‌ను వెనక్కి నెట్టిన ల్యారీ ఎల్లిసన్

ప్రపంచ కుబేరుల్లో అగ్రస్థానానికి



న్యూయార్క్: అమెరికన్ టెక్నాలజీ కంపెనీ ఒరాకిల్ సహ-వ్యవస్థాపకుడు ల్యారీ ఎల్లిసన్ ప్రపంచ ధనవంతుల జాబితాలో టెస్లా సారథి ఎలాన్ మస్క్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి ఎగబాకారు. ఫోర్బ్స్ రియల్ టైం బిలియనీర్స్ లిస్ట్ ప్రకారం.. 81 ఏళ్ల ఎల్లిసన్ వ్యక్తిగత సంపద బుధవారం ఏకంగా 10,100 కోట్ల డాలర్లు (సుమారు రూ.8.89 లక్షల కోట్లు) పెరిగి మొత్తం రూ.39,570 కోట్ల డాలర్లకు (రూ.34.82 లక్షల కోట్లు) చేరుకుంది. ఒరాకిల్ షేరు ఒక్కరోజే ఏకంగా 41 శాతం పెరగడం ఇందుకు దోహదపడింది. 1992 తర్వాత ఒక్క రోజులో కంపెనీ షేరు ఇంత భారీగా పెరగడం ఇదే ప్రథమం. దాంతో ఒరాకిల్ మార్కెట్ విలువ 29,900 కోట్ల డాలర్ల మేర పెరిగి లక్ష కోట్ల డాలర్లకు చేరువైంది. ప్రస్తుతం సంస్థలో ఎల్లిసన్ 41 శాతం వాటా కలిగి ఉన్నారు. ఒరాకిల్ త్రైమాసిక పనితీరు మార్కెట్ అంచనాలను మించడంతోపాటు క్లౌడ్ వ్యాపారం భవిష్యత్‌పై అత్యంత ఆశావహ అంచనాలను విడుదల చేయడం కంపెనీ షేర్లు భారీగా ర్యాలీ తీశాయి. కాగా, ప్రపంచ కుబేరుల జాబితాలో 300 రోజులుగా అగ్రస్థానంలో కొనసాగుతూ వచ్చిన మస్క్ రెండో స్థానానికి జారుకున్నారు. ప్రస్తుతం ఆయన సంపద 38,500 కోట్ల డాలర్లకు (రూ.33.88 లక్షల కోట్లు) పరిమితమైంది.

మూడో రోజూ లాభాల్లో సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్‌లో అప్‌ట్రెండ్ బుధవారం నాడు కూడా కొనసాగింది. సెన్సెక్స్ *323.83* పాయింట్ల లాభంతో *81,425.15* వద్ద ముగియగా నిఫ్టీ *104.5* పాయింట్ల లాభంతో *24,973.10* వద్ద ముగిసింది. సెన్సెక్స్ లాభాలతో ముగియడం వరుసగా ఇది మూడో రోజు కాగా నిఫ్టీకి ఆరో రోజు. భారత-అమెరికా వాణిజ్య చర్చలు త్వరలోనే ఒక కొలిక్కి వచ్చే రావచ్చునన్న ఆశలు, జీఎస్‌టీ రేట్ల సవరణతో ఈ ఆర్థిక సంవత్సరం రెండో అర్ధ భాగంలో కంపెనీల ఆదాయాలు బాగా పుంజుకుంటాయన్నఅంచనాలు, ఎఫ్‌పీఐల కొనుగోళ్లు కూడా ఇందుకు తోడయ్యాయి.

- బుధవారం ప్రారంభమైన అర్బన్ కంపెనీ ఐపీఓకు మదుపరులు బ్రహ్మరథం పట్టారు. సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన కొద్ది సేపటికే ఇష్యూ మొత్తం సబ్‌స్క్రైబ్ అయింది. తొలి రోజు ముగిసే సరికి *3.13* రెట్లు సబ్‌స్క్రైబ్ అయినట్టు సమాచారం.

ఎంఎఫ్ లావాదేవీల్లో ఎన్ఎస్ఈ రికార్డు: మ్యూచువల్ ఫండ్ లావాదేవీల్లో 'ఎన్ఎస్ఈ ఎంఎఫ్ ఇన్వెస్ట్ ప్లాట్‌ఫాం' రికార్డు సృష్టించింది. బుధవారం ఈ వేదికపై రికార్డు స్థాయిలో 15 లక్షలకుపైగా లావాదేవీలు నమోదైనట్టు ఎన్ఎస్ఈ తెలిపింది. సభ్యులు, డిస్ట్రిబ్యూటర్ల నమ్మకం, మద్దతుతోనే ఇది సాధ్యమైందని ఎన్ఎస్ఈ పేర్కొంది.

బిజినెస్

రూ.35 తగ్గనున్న సిమెంట్ ధర

ఇండియా రేటింగ్స్

న్యూఢిల్లీ: జీఎస్‌టీ సంస్కరణలతో సిమెంట్ ధరలు దిగి రానున్నాయి. ఈ తగ్గింపు 50 కిలోల బస్తాపై రూ.30 నుంచి రూ.35 వరకు ఉంటుందని ఇండియా రేటింగ్స్ అంచనా. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లో రిటైల్ మార్కెట్‌లో బస్తా సిమెంట్ ధర కంపెనీని బట్టి రూ.330 నుంచి రూ.370 వరకు పలుకుతోంది. జీఎస్‌టీ ప్రయోజనాలను ఈ నెల 23 నుంచి వినియోగదారులకు బదిలీ చేయాలని కంపెనీలు భావిస్తున్నట్టు సమాచారం. అదే జరిగితే రిటైల్ మార్కెట్‌లోనూ బస్తా సిమెంట్ ధర రూ.30 నుంచి రూ.35 వరకు తగ్గుతుందని అంచనా.

ఎస్ఎస్ఎల్‌వీ తయారీ కోసం 3 కంపెనీలతో హెచ్ఏఎల్ ఒప్పందం

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): 500 కిలోల కన్నా తక్కువ బరువు గల ఉపగ్రహాల ప్రయోగానికి స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ఎస్ఎస్ఎల్‌వీ) తయారీ కోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్-స్పేస్), ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో), న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) మధ్య సాంకేతిత బదిలీ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా హెచ్ఏఎల్ ఎస్ఎస్ఎల్‌వీ రాకెట్లను సొంతంగా అభివృద్ధి చేయడంతో పాటు వాటి నిర్వహణ బాధ్యత కూడా స్వీకరిస్తుంది. ఇందుకోసం వచ్చే రెండేళ్లపాటు హెచ్ఏఎల్‌కు ఇస్రో అవసరమైన శిక్షణ ఇవ్వడంతోపాటు రాకెట్ల అభివృద్ధికి సాంకేతిక మద్దతునివ్వనుంది.

కృత్రిమ మేధతో ప్రపంచ జీడీపీకి అదనంగా రూ.1,382 లక్షల కోట్లు




న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) 21వ శతాబ్దిని నిర్వచించే టెక్నాలజీగా మారిందని, 2030 నాటికి ప్రపంచ జీడీపీకి ఇది 1570 కోట్ల డాలర్లు (రూ.1,382 లక్షల కోట్లు) జోడిస్తుందని ఫిక్కీ-బీసీజీ రూపొందించిన ఒక శ్వేతపత్రంలో అంచనా వేశాయి. అయితే ఏఐని అనుసరించే విషయంలో మాత్రం భారీ వ్యత్యాసాలున్నట్టు ఆ పత్రంలో తెలిపాయి. ప్రపంచ సమ్మిళిత వృద్ధికి ఏఐని ఒక సాధనంగా చేసుకోవాలని పిలుపు ఇచ్చాయి. ఏఐని అందరికీ అందుబాటులోకి తేవడానికి పరిశోధన, పెట్టుబడులు, నైపుణ్యాల కల్పన, నైతిక (రైజ్) నియమావళి అనుసరించాలని సూచించాయి. అందులోని ప్రధానాంశాలు...

- ఈ రంగంలో పరిశోధనలు, ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ-ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించాలి.
- ఏఐని అందరికీ ప్రత్యేకించి వెనుకబడిన ప్రాంతాలకు అందుబాటులోకి తేవడం లక్ష్యంగా పెట్టుబడులు, మౌలిక వసతులు విస్తరించాలి.
- ఏఐ ప్రతిభలో వ్యత్యాసాలు తొలగించేందుకు సిబ్బందిలో నైపుణ్యాలకు మెరుగులు దిద్దడంతో పాటు ఏఐ పరిజ్ఞానాన్ని అందరూ భారీ ఎత్తున పంచుకునే వాతావరణం సృష్టించాలి.
- ఏఐ వ్యవస్థలు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా ఉండేలా చూసేందుకు శక్తివంతమైన వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

23 నుంచి గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్

అమెజాన్ ఇండియా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్, 2025 ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతోంది. అమెజాన్ ప్రైమ్ సబ్‌స్క్రైబర్లు ఒక రోజు ముందే ఇందులో పాల్గొనవచ్చు. ఈ ఫెస్టివల్‌లో 17 లక్షల మందికి పైగా అమ్మకందారులు తమ ఉత్పత్తులను అమ్మకానికి పెడుతున్నారు. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అమ్మకందారులే 80,000 వరకు ఉంటారని అమెజాన్ ఇండియా డైరెక్టర్ (షాపింగ్ ఎక్స్‌పీరియన్స్) తోట కిషోర్ చెప్పారు. రెండు రాష్ట్రాల్లోని 700కుపైగా డెలివరీ కేంద్రాల ద్వారా ఈ సారి తమ కస్టమర్లకు సరుకులు అందించనున్నట్టు తెలిపారు. జీఎస్‌టీ రేట్ల సవరణతో ఈ ఏడాది 'అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్, 2025' అమ్మకాలు భారీగా పుంజుకుంటాయని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఈ ఫెస్టివల్ అమ్మకాల రద్దీకి అనుగుణంగా సరుకులను కొనుగోలుదారులకు అందించేందుకు లక్షన్నర మంది సీజనల్ ఉద్యోగులను అమెజాన్ ఇండియా నియమించింది. తెలంగాణ సహా దేశంలోని ప్రధాన నగరాల్లో కొనుగోలు దారులు ఎక్కువగా మిడ్ ప్రీమియం స్మార్ట్‌ఫోన్లు, టీవీల వంటి కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్ పరికరాలపై ఆసక్తి చూపిస్తున్నట్టు అమెజాన్ ఇండియా డైరెక్టర్ (కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్) జెబా ఖాన్ చెప్పారు.

ఈ ఏడాది వృద్ధి 6.9 శాతం

అంచనాలను పెంచిన ఫిచ్.. దేశీయ డిమాండ్ వృద్ధికి చోదకం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ పరపతి రేటింగ్ ఏజెన్సీ ఫిచ్ రేటింగ్స్ ఈ ఆర్థిక సంవత్సరానికి భారత జీడీపీ వృద్ధిరేటు అంచనాను గతంలో ప్రకటించిన 6.5 శాతం నుంచి 6.9 శాతానికి పెంచింది. ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో బలమైన వృద్ధి నమోదవడంతో పాటు దేశీయంగా వినియోగం భారీగా పుంజుకోనుండటం ఇందుకు కారణంగా పేర్కొంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, ట్రంప్ సుంకాల నేపథ్యంలో పలు క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీలు, బహుళజాతి ఆర్థిక సంస్థలు 2025-26 ఆర్థిక సంవత్సరానికి భారత వృద్ధి అంచనాలను తగ్గిస్తూ వచ్చాయి. ఇలాంటి ఆర్థిక అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలోనూ వృద్ధి అంచనాలను పెంచిన తొలి అంతర్జాతీయ ఏజెన్సీ ఫిచ్. పైగా అన్ని ఏజెన్సీల్లోకెల్లా అత్యధిక వృద్ధిని అంచనా వేసింది కూడా ఇదే. దేశీయంగా వినియోగం భారీగా పెరగడంతో పాటు ట్రంప్ సుంకాల ప్రభావం నుంచి బయటపడేందుకు జీఎస్‌టీ రేట్ల తగ్గింపు దోహదపడగలదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నెలకుగాను ఫిచ్ విడుదల చేసిన గ్లోబల్ ఎకనామిక్ ఔట్‌లుక్ నివేదికలోని మరిన్ని విషయాలు..

- ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి 6.7 శాతం వృద్ధిని అంచనా వేయగా.. 7.8 శాతానికి పెరిగింది. ఈ నేపథ్యంలో పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 6.5 శాతం నుంచి 6.9 శాతానికి పెంచుతున్నట్టు తెలిపింది.
- గడిచిన కొన్ని నెలల్లో అమెరికా-భారత్ మధ్య వాణిజ్య అనిశ్చితి పెరిగింది. భారత్‌పై తొలుత 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్.. ఆగస్టు 27 నుంచి 50 శాతానికి పెంచారు. భవిష్యత్‌లో ఈ సుంకం మళ్లీ దిగిరావచ్చని భావిస్తున్నాం. కానీ, అమెరికాతో వాణిజ్య సంబంధాలపై నెలకొన్న అనిశ్చితి వ్యాపార సెంటిమెంట్, పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం చూపనుంది.
- ఈనెల 22 నుంచి అమల్లోకి రానున్న జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంతో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరంలో వినియోగం పెరిగేందుకు దోహదపడనుంది. దేశీయ డిమాండే వృద్ధికి ప్రధాన చోదకం. బలమైన గృహ ఆదాయం వినియోగానికి, సులభమైన ఆర్థిక పరిస్థితులు పెట్టుబడులకు ఊతమివ్వనున్నాయి.
- ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో మాత్రం వృద్ధి కాస్త నెమ్మదించవచ్చు. 2026-27లో వృద్ధిరేటు 6.3 శాతంగా, 2027-28 ఆర్థిక సంవత్సరంలో 6.2 శాతంగా నమోదు కావచ్చని అంచనా.
- ఈ సారి మెరుగైన వర్షపాతం నమోదవడంతో పాటు అధిక స్థాయిలో ఆహార నిల్వలున్న నేపథ్యంలో ధరల సూచీ అదుపులోనే ఉండనుంది. ఈ ఏడాది చివరినాటికి వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 3.2 శాతంగా, 2026 చివరినాటికి 4.1 శాతంగా నమోదు కావచ్చని అంచనా.
- ఈ ఏడాది చివర్లో ఆర్‌బీఐ రెపోరేటును మరో 0.25 శాతం తగ్గించవచ్చు. వచ్చే ఏడాదిలో మాత్రం రెపో యథాతథంగా కొనసాగవచ్చు. ఆర్‌బీఐ 2027లో రెపోరేటును మళ్లీ పెంచేందుకు అవకాశాలున్నాయి.

రాజమండ్రిలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్

100 పడకల సామర్థ్యంతో ఏర్పాటు

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్‌లో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సేవలను మరింత విస్తరించింది. తాజాగా రాజమండ్రిలో 100 బెడ్ల సామర్థ్యంతో కూడిన ఆస్పత్రిని బుధవారం ప్రారంభించింది. ఏపీలో రెయిన్‌బోకు ఇది మూడో హాస్పిటల్. విజయవాడ, విశాఖపట్నంలో ఇప్పటికే ఆస్పత్రులను నిర్వహిస్తోంది. అంతేకాదు, ఈ ఆర్థిక సంవత్సరంలో వరంగల్, గువాహటి తర్వాత రెయిన్‌బో ప్రారంభించిన మూడో హాస్పిటల్ కూడా ఇదే. ఈ విస్తరణతో కలిపి రెయిన్‌బో మొత్తం 9 నగరాల్లో 2,300 పడకల సామర్థ్యంతో కూడిన 22 హాస్పిటళ్లు, 5 క్లినిక్‌లను నిర్వహిస్తోంది.

ఎస్రీ ఇండియాతో ధ్రువ స్పేస్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సొల్యూషన్స్ సంస్థ ఎస్రీ ఇండియాతో హైదరాబాద్ స్టార్టప్ ధ్రువ స్పేస్ అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ధ్రువ స్పేస్ తన ఆస్ట్రావ్యూ శాటిలైట్ ఇమేజరీ సర్వీస్‌ను ఎస్రీ ఇండియాకు చెందిన ఆర్క్‌జీఐఎస్ ప్లాట్‌ఫామ్‌తో అనుసంధానించనుంది. తద్వారా 200కు పైగా ఉపగ్రహాల నుంచి భూమి పరిశీలనకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులు మరింత సులభంగా పొందేందుకు వీలుపడనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	విజయవాడ	137
వరంగల్	118	గుంటూరు	127
కరీంనగర్	118	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	118	చిత్తూరు	111
కర్నూలు	118	నెల్లూరు	116
విశాఖపట్నం	141	అనంతపురం	116
గోదావరి	137		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,10,510 ▲	1,01,300 ▲	1,40,000 ▲
విజయవాడ	1,13,000 ▲	1,07,000 ▲	1,28,270 ▲
విశాఖపట్నం	1,12,990 ▲	1,01,300 ▲	1,40,000 ▲
రాజమండ్రి	1,10,510 ▲	1,01,300 ▲	1,27,900 ▼
ప్రొద్దుటూరు	1,13,700 ▲	1,04,600 ▲	1,28,000 ▼
ముంబై	1,09,640 ▲	1,00,430 ▲	1,24,590 ▼

గుంటూరు రూరల్ వార్తలు

మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

బకింగ్ హామ్ కెనాల్‌లో మృతదేహాల కలకలం

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని కత్తులపేట వద్ద బకింగ్ హామ్ కెనాల్‌లో రెండు మృతదేహాలు కొట్టుకురావడం కలకలం రేపింది. తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి తెలిపిన వివరాల ప్రకారం కాలువ ఒడ్డు కంపచెట్లలో మృతదేహాలు కుళ్ళిపోయి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలువలో నీటి ఉరవడి ఎక్కువగా ఉండడంతో ఒక పురుషుని మృతదేహం కంపల్లో ఇరుక్కుని కనపడుతోంది. ఫైర్, మున్సిపల్ సిబ్బంది సాయంతో గుర్తుపట్టని విధంగా ఉన్న మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మరో మృతదేహం కోసం గాలిస్తున్నట్టు ఎస్ఐ ఖాజావలి తెలిపారు.

ప్రకాశం బ్యారేజి వద్ద తగ్గిన వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. బ్యారేజీ ఎగువ నుంచి 42,924 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ఇన్‌ఫ్లోగా నమోదయినట్లు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజ్ నుంచి దిగువకు 25,375 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 10,276 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 7,026 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 247 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ రాజేశ్ తెలిపారు.

రూ.4,16,000 పలికిన లడ్డూ

తుళ్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మందడం వేణుగోపాల స్వామి ఆలయంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద ఉంచిన లడ్డూను బుధవారం జరిగిన వేలంలో గ్రామానికి చెందిన దొండపాటి నాగేశ్వరావు దక్కించుకున్నారు. లడ్డూ రూ.4,16,000 పలికింది.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 145 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు, క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,100 పలకగా.. గరిష్ఠ ధర రూ.10,400, మోడల్ ధర రూ.10,400 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,100 పలకగా.. గరిష్ఠ ధర రూ.10,400, మోడల్‌ధర రూ.10,400 పలికాయి.

రెండు మట్టి లారీల స్వాధీనం

తుళ్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు లారీలను తుళ్లూరు పోలీసులు బుధవారం తెల్లవారు జామున అదుపులోకి తీసుకున్నారు. లారీలు తాడేపల్లి మండలం పాతూరు గ్రామానికి చెందినవిగా తుళ్లూరు సీఐ-2 అంజయ్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

గృహోపకరణాలు దగ్ధం

మేడికొండూరు సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం, కొర్రపాడులో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి జమ్మలమూడి రవి ఇంటిలో వస్తువులు దగ్ధం అయ్యాయి. బుధవారం జరిగిన ఈ ఘటనలో 50వేల నష్టం జరిగిందని బాధితులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు రవి కుటుంబానికి తక్షణ సాయంగా బియ్యం, చక్కెర, కూరగాయలు, వంట సామాగ్రి అందజేశారు.

రేపటి నుంచి జిల్లాస్థాయి పోటీలు

పెదనందిపాడు, సెప్టెంబరు, 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో వెంకయ్య 27వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నుంచి 17వ తేదీ వరకు విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్, డిబేట్, శ్రీశ్రీ గేయాల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. 17న కొల్లా వెంకయ్య వర్ధంతి సభ నిర్వహించి, పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం జరగనున్నట్లు తెలిపారు.

రేపు గొట్టిపాడులో కంటివైద్య శిబిరం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొట్టిపాడు హిందూ ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాలలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు పచ్చల శ్రీనివాసరావు తెలిపారు. పచ్చల సుబ్బారావు, పచ్చల రామ సుబ్బారావుల జ్ఞాపకార్థం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

విద్యార్థులూ డ్రగ్స్ బారిన పడకండి: సైబర్ సెక్యూరిటీ సీఐ నిస్సార్ బాషా

మేడికొండూరు సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం నల్లపాడులోని విక్టోరియా ఫార్మసీ కళాశాల యూత్ సర్వీసెస్ విభాగం ఆధ్వర్యంలో డ్రగ్స్ నిరోధంపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ సెక్యూరిటీ సీఐ నిస్సార్ బాషా మాట్లాడుతూ యువతను లోన్ యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలని, ప్రలోభాలకు లోలై వారి బారిన పడి అనేకమంది ఆత్మహత్యకు పాల్పడుతున్నారని చెప్పారు. డ్రగ్స్, నార్కోటిక్ ఎస్ఐ ఎం.సునీల్ బాబు మాట్లాడుతూ మానవ జీవితాన్ని సర్వనాశనం చేసే గంజాయి ఇతర రసాయన మత్తుమందులకు విద్యారులు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఫాదర్ బెల్లంకొండ ఇన్నయ్య, ప్రిన్సిపల్ డాక్టర్ టి.వినయ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ పి. శివన్నారాయణ తదితరులతోపాటు కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

దుగ్గిరాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంటకోతల ప్రయోగాలపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో, మండలకేంద్రం దుగ్గిరాలలో సమావేశం బుధవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఆర్.విజయబాబు, ఏఎస్‌వో సూర్యనారాయణ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్ పంటల సాగుతో మేలు: ఏవో

పెదనందిపాడు, సెప్టెంబరు, 10 (ఆంధ్రజ్యోతి): అంతర్ పంటల సాగుతో రైతులకు మేలు చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి ఐ.సుబ్రహ్మణ్యం అన్నారు. మండల పరిధిలోని వరగాని, అబ్బినేనిగుంటపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులకు శెనగ, కందుల విత్తనాల సంచులను అందజేశారు.

పోలీసు వసతి కోసం నాక్ కార్యాలయం



నాక్ బిల్డింగ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

తుళ్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలకు వేరే జిల్లాల నుంచి వచ్చే పోలీసు సిబ్బందికి అవసరమైన షెల్టర్ కోసం నాక్ కార్యాలయాన్ని ప్రారంభించారు. పాఠశాలలు, ఆశ్రమాల నిర్వాహకులను అడిగి పోలీసులు 20రోజులు అందులో ఉండేవారు. సీఆర్డీఏ అధికారుల సహకారంతో తుళ్లూరులోని నాక్ బిల్డింగ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఈ బిల్డింగ్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, తుళ్లూరు పోలీసు స్టేషన్ బందోబస్తు, భద్రతా విధులు నిర్వహించే బెటాలిన్ల నుంచి వచ్చే పోలీసు సిబ్బందికి వసతికి ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సుమారు వందమంది పోలీసు సిబ్బంది సౌకర్యవంతంగా ఉండటానికి సిద్ధం చేసినట్టు చెప్పారు. అదనంగా మందడంలో మరో వందమందికి సరిపడా వసతి ఏర్పాటు చేసినట్టు తుళ్లూరు డీయస్పీ మురళీకృష్ణ తెలిపారు. సీఆర్డీఏ అధికారులు ఐటీ శాఖ మంత్రి లోకేశ్ చొరవతో సీఎస్ఆర్ నిధుల కింద పది లక్షల వ్యయంతో బాత్ రూంలు, వసతి గదులు సిద్ధం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ మురళీకృష్ణ సీఐలు కొంకా శ్రీనివాసరావు, అంజియ్య, ట్రాఫిక్ సీఐలు కోటేశ్వరావు, నరేష్, తాడేపల్లి ఎస్ఐ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

యూరియాపై వైసీపీవి అసత్య ప్రచారాలు

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



రైతులకు డ్రోన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే బూర్ల

గుంటూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అభూత కల్పనలు, అసత్య ప్రచారాలు చేస్తూ రైతులు యూరియా లేక రోడ్లపైకి వస్తున్నారంటూ వైసీపీ నేతలు గగ్గోలు పెట్టడం చూస్తే వీళ్ళు మనుషులేనా అని అనిపిస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే 1191 మెట్రిక్ టన్నుల యూరియా అందించామన్నారు. ఇంకా రైతుల కోసం యూరియా 300టన్నులు సిద్ధంగా ఉంచామని చెప్పారు. సమావేశంలో కంచర్ల శివరామయ్య, సాహెబ్, గింజుపల్లి వెంకటేశ్వరరావు, కల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సేద్యాన్ని సులభతరం చేసేందుకే డ్రోన్లు

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సేద్యాన్ని సులభతరం చేసేందుకు ప్రభుత్వం డ్రోన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చిందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక విద్యానగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ప్రత్తిపాడు మండలం, కోయవారిపాలెం, పెదగొట్టిపాడు గ్రామాలకు చెందిన రెండు గ్రూపులకు మంజూరైన రెండు డ్రోన్లను రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రూ.10 లక్షలు విలువ చేసే డ్రోన్‌ని 80శాతం రాయితీతో కేవలం రూ.2లక్షలకే అందజేస్తున్నామన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో గుంటూరు చానల్ పొడిగింపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపి భూసేకరించేందుకు నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ మోహన్‌రావు, ఏవో సుగుణ బేగం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను ఆప్కాస్ నుంచి తొలగించడం ఆపాలి

● సీఐటీయూ నేత దొంతిరెడ్డి వెంకటరెడ్డి

తాడేపల్లి (ప్రాతూరు), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులను ఆప్కాస్ నుంచి తొలగించడం ఆపాలని సీఐటీయూ నేత దొంతిరెడ్డి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ప్రాతూరు పారిశుధ్య కార్మికుల విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేసిన ఒప్పందం ప్రకారమే కార్మికులను ఆప్కాస్ నుంచి తొలగించకుండా కొనసాగించాలన్నారు. పారిశుధ్య కార్మికుల కుటుంబాలలో రూ.12వేలకు పైబడి జీతం తీసుకుంటున్నారనే కారణంతో తల్లికి వందనం పథకం కార్మికుల పిల్లలకు వర్తింపజేయకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కృష్ణ, పి.నాగేశ్వరరావు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

తుళ్లూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో పారిశుధ్య కార్మికుల నిరసన కొనసాగుతుంది. రెండు నెలల పెండింగ్ జీతీలు చెల్లించాలని పని విరామ సమయంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. బుధవారానికి నాటికి ఆందోళన 3వ రోజుకు చేరుకుంది. 12వ తేదీన చలో తుళ్లూరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పారిశుధ్య కార్మికుల గౌరవ అధ్యక్షుడు ఎం.రవి కోరారు. కార్యక్రమంలో పలువురు కార్మిక నేతలు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలే శరణ్యం

తాడేపల్లి (కుంచనపల్లి), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్మికవర్గ సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలే శరణ్యమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై నేతాజీ అన్నారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో సీఐటీయూ మండల కార్యదర్శి పల్లె కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నేతాజీ మాట్లాడుతూ పాలక వర్గాలు యాజమాన్యాలకు కొమ్ము కాస్తూ అన్ని వర్గాల కార్మికులపై పని ఒత్తిడి భారాన్ని పెంచుతున్నాయన్నారు. కాగా సీఐటీయూ కుంచనపల్లి గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా టి.దయామణి, కార్యదర్శిగా కె.శ్యామల, ఉపాధ్యక్షురాలిగా కొండపల్లి యశోద, సహాయ కార్యదర్శిగా కృష్ణతులసి ఎన్నికయ్యారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి కాజ వెంకటేశ్వరరావు, ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు గోపాలం శంకరరావు, లక్ష్మి, భారతి, నల్లపు శివపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల వేతనాల పెంపుపై ఉద్యమం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల వేతనాల పెంపు కోసం ఉద్యమిస్తామని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు ఎస్.రమణ తెలిపారు. మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఆశా వర్కర్స్ యూనియన్ మహాసభ జరిగింది. రమణ మాట్లాడుతూ రాజకీయ వేధింపులు మానుకుని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లక్ష్మీ పాల్గొన్నారు. అనంతరం 11మందితో ఆశా వర్కర్స్ యూనియన్ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మహాలక్ష్మి, కార్యదర్శిగా కే.శ్రావణి తదితరులను ఎన్నుకున్నట్టు ప్రకటించారు.

రైతులకు అందుబాటులో యూరియా: ఏవో షేక్ సుగుణ బేగం

ప్రత్తిపాడు, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాలకు తగ్గట్టుగా ప్రత్తిపాడు మండలంలో యూరియా అందుబాటులో ఉందని ప్రత్తిపాడు వ్యవసాయ శాఖాధికారి షేక్ సుగుణ బేగం అన్నారు. ప్రత్తిపాడు మండల పరిధిలోని పలు దుకాణాలలో ఆమె తనిఖీలు నిర్వహించారు. యూరియా మీ చెంతకు అనే బ్యానర్‌ను ప్రదర్శించారు. ఇప్పటికే రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా పలు గ్రామాలలో యూరియా సరఫరా చేయడం జరిగిందన్నారు. రైతులు ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని ఆమె కోరారు.

అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా: ఏవో సుధాకర్

కాకుమాను, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరత నేపథ్యంలో అన్ని రైతు సేవా కేంద్రాలకు యూరియా వచ్చేలా చర్యలు తీసుకుంటానని మండల వ్యవసాయశాఖ అధికారి సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని రేటూరు, అప్పాపురం గ్రామాలలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన ఏవో సుధాకర్ అనంతరం రైతులకు జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి రైతు పంట నమోదు ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ మహేంద్ర నాయక్, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

తాడేపల్లి (వడ్డేశ్వరం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో బుధవారం అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్యూ ఎడ్యుకేషన్ సెల్, ఎఫ్ఈడీ, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ పర్యవేక్షణలో ఆత్మహత్యల నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోస్టర్ ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంక్షేమ విభాగం డీన్, సలహాదారులు డాక్టర్ హబిబుల్లా ఖాన్, వేల్యూ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ పవన్‌కుమార్, కార్యక్రమంలో వర్సిటీ వీసీ పార్థసారధివర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

పీఏఎస్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ



కళాశాలలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న జిల్లా రీజనల్ ఇన్‌స్పెక్షన్ అధికారి సునీత

పెదనందిపాడు, సెప్టెంబరు, 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏఎస్ కళాశాలను రీజనల్ ఇన్‌స్పెక్షన్ అధికారి జి.సునీత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్ కోర్సుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై ఆరాతీశారు. తరగతి గదులు, ల్యాబ్‌లు, పరీక్షా గదుల్లోని సీసీ కెమెరాలను, విద్యార్థుల సామర్థ్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పాలకవర్గ సభ్యులు కల్పిస్తున్న వసతులను ప్రిన్సిపాల్ జి.వీరరాఘవయ్య, వ్యాయామ అధ్యాపకులు పి.శ్రీనివాసరావులు ఆమెకు వివరించారు.

సోలార్ పీవీ టెక్నీషియన్ కోర్సులో మహిళలకు శిక్షణ

మంగళగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడకు చెందిన వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఆస్ట్రేలియా కాన్సులేట్ సహకారంతో ఆత్మకూరులోని నిర్మల ఫార్మసీ కళాశాలలో మహిళలకు సోలార్ పీవీ టెక్నీషియన్ కోర్సులో శిక్షణ ఇస్తున్నారు. 14 రోజులపాటు జరుగనున్న ఈ శిక్షణా శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ నిర్మల జ్యోతి, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బొల్లినేని కీర్తి, కళాశాల ప్రిన్సిపాల్ పాముల రెడ్డి, మహిళా సెల్ కో ఆర్డినేటర్ రత్నమంజుల, ఎన్ఎస్ఐసీ సభ్యులు రాబిన్ జేమ్స్ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

జీఐ ట్యాగ్‌తో నకిలీలను నివారించవచ్చు

● ఎంఎస్ఎంఈ డీఎఫ్‌వో, ఏఈడీఎస్ ఏడీ కేఎల్ఎస్ రెడ్డి

తాడికొండ (లాం) సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) ట్యాగ్‌తో నకిలీ ఉత్పత్తులు నివారించవచ్చునని ఎంఎస్ఎంఈ డీఎఫ్‌వో, ఏఈడీఎస్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కే.ఎల్.ఎస్.రెడ్డి అన్నారు. బుధవారం లాం చలపతి ఫార్మసీ కళాశాలలో పేటెంట్ ఫైలింగ్, జియోగ్రాఫికల్ ఇండికేషన్ స్టడీస్ అనే అంశంపై రెండు రోజుల ప్రత్యేక వర్క్‌షాప్‌ను ఎంఎస్ఎంఈ-ఏపీఎఫ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు ఏఎంసీహెచ్ఎస్ స్పెషలిస్ట్ కన్సల్టెంట్ టీ.ఆర్. రమేష్, గుంటూరు వోక్స్ ఫాంటమ్ ఏపీఆర్ అటార్నీ ఎం.సుధీర్, చలపతి విద్యా సంస్థల ఛైర్మన్ వై.వీ.ఆంజనేయులు, ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, వివిధ కళాశాలల నుంచి 210 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాకథాన్‌కు అనూహ్య స్పందన

● ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో సెమీ ఫైనల్స్

విజయవాడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాక్‌థాన్ - 2025 సెమీ ఫైనల్ పోటీలకు విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. గంగూరులోని ధనేకుల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం జరిగిన ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని 30కళాశాలలు, పలు విశ్వవిద్యాలయాల నుంచి 60 విద్యార్థుల జట్లు హాజరయ్యాయి. ఈ 60 జట్లకు క్వాంటమ్ కంప్యూటింగ్‌కు సంబంధించిన పది థీమ్స్‌ను ఇవ్వగా క్వాంటమ్ కంప్యూటింగ్‌తో పరిష్కారం సాధ్యమని విద్యార్థులు నిరూపించారు. త్వరలో జరిగే అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాకథాన్-2025 ఫైనల్ పోటీలకు ఇక్కడ హాజరైన 60జట్లలో ఉత్తమ 20జట్లను పంపనున్నారు. ఒక్కో థీమ్ నుంచి రెండు జట్లు చొప్పున మొత్తం 20జట్లను ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఎంపిక చేశారు.

రూ.4.5 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ హెప్సీబా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మంత్రి నారా లోకేశ్ చొరవతో హెప్సీబా వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4 లక్షల 50వేలు మంజూరయ్యాయి. ఈ లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) చెక్కును మంగళగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ స్థానిక నేతలతో కలిసి బుధవారం బాధితురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎల్‌వోసీ చెక్కు రావడానికి సహకరించిన మంత్రి లోకేశ్‌కు బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదల రమేష్‌బాబు, జొన్నలగడ్డ రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల ఐలమ్మకు ఘన నివాళి

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని తెలుగు ప్రపంచానికి చాటి చెప్పిన వీరవనిత చిట్యాల ఐలమ్మకు ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లభాపురం వెంకటేశ్వరరావు ఘనంగా నివాళి అర్పించారు. బుధవారం తాడేపల్లిలోని చిట్యాల ఐలమ్మ రజక కళ్యాణ మండపం వద్ద జరిగిన ఐలమ్మ 40వ వర్ధంతి, సత్తెనపల్లి రామకృష్ణ 25వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో చిట్యాల ఐలమ్మ త్యాగనిరతిని మరువలేమన్నారు. 2000లో జరిగిన విద్యుత్ పోరాటంలో ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ సత్తెనపల్లి రామకృష్ణ పోరాటం నేటి రజక సోదరులకు ఆదర్శప్రాయంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో నేతలు ఉండవల్లి పార్థసారధి, పాగోలు శ్రీనివాసరావు, తాడేపల్లి సాంబశివరావు, బొజ్జా సుబ్బారావు, శివయ్య, వీరాంజనేయులు, శ్యామ్, దుర్గారావు, అప్పారావు, వెంకటరమణ, మల్లీశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా సమస్య పరిష్కరించుకోవాలి

● ఆర్డీవో శ్రీనివాసులు



అధికారులతో మాట్లాడుతున్న బడేపురం గ్రామస్థులు

తాడికొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రెండు వర్గాల మధ్య ఉన్న వివాదాన్ని శాంతియుతంగా సమస్య పరిష్కరించుకోవాలని గుంటూరు ఆర్డీవో ఆర్.శ్రీనివాసులు పేర్కొన్నారు. తాడికొండ శివారు బడేపురం గ్రామం కొండపై నిర్మించిన శివాలయంకు వెళ్లే దారి నుంచి భవానీపీఠం మధ్య స్థలంపై ఇరు వర్గాలకు మధ్య వివాదం ఉన్న కారణంగా సమస్య పరిష్కారం కోసం రెండు వర్గాలతో పీస్ కమిటీ మీటింగ్‌ను బుధవారం నిర్వహించారు. పీస్ కమిటీ సమావేశంలో ఇరువర్గాలకు అధికారులు పలు సూచనలు చేశారు. 30 అడుగులు ఉన్న స్థలాన్ని 15అడుగులమేర ఇరుమతాల వారు తీసుకోవాలని సూచించారు. దీంతో హిందువులు అధికారుల సలహాను పాటిస్తామని పేర్కొన్నారు. క్రిస్టియన్లు అధికారులు సూచనను ఒప్పుకోలేదు. దీనిపై అధికారులు మరోసారి పరిశీలించాలని క్రిస్టియన్లకు సూచించారు. కార్యక్రమంలో తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, సీ.ఐ వాసు, తహసీల్దార్ మెహర్‌కుమార్, వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కర్మకాండల షెడ్డు ధ్వంసంపై కేసు నమోదు

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చమళ్ళమూడిలో కర్మకాండల షెడ్డు ధ్వంసంపై కేసు నమోదు చేసినట్టు సీఐ రమానాయక్ వెల్లడించారు. ఈ నెల 7న చమళ్ళమూడిలో అంత్యక్రియల కోసం దాతలు నిర్మించిన షెడ్డు, ట్యాంకు, బల్లను ధ్వంసంచేశారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పీఎంఎంవీవైపై అవగాహన కలిగి ఉండాలి

● ఐసీడీఎస్ పీడీ ప్రసూన



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ప్రసూన, పక్కన సీడీపీవో విజయలక్ష్మి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పీఎంఎంవీవై పథకంపై ప్రతి అంగన్వాడీ కార్యకర్త పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ పీడీ పీ ప్రసూన తెలిపారు. ప్రత్తిపాడు జడ్పీ పాఠశాలలో ప్రత్తిపాడు ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాప్‌లో వివరాల నమోదులో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ప్రతి మొదటి కాన్పుకు తల్లులకు ఆరు వేల రూపాయలు, రెండో కాన్పులో ఆడపిల్ల పుడితే మరో ఆరువేలు ఇస్తారన్నారు. ఈ సందర్భంగా సీడీఈవో విజయలక్ష్మి, ఏసీడీపీవో విజయ నిర్మళ పీఎంఎంఈవో పథకంపై శిక్షణ వచ్చారు. కార్యక్రమంలో సఖి ఒన్‌స్టాప్ సెంటర్ నుంచి శాంతి, సూపర్‌వైజర్లు భారతి, మాధవి, ప్రాజెక్టు పరిధిలోని అన్ని మండలాలకు చెందిన సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఘనంగా సీఎం చంద్రబాబు, భువనేశ్వరి వివాహ వార్షికోత్సవం

దుగ్గిరాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం దుగ్గిరాలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, భువనేశ్వరిల 44వ వివాహ వార్షికోత్సవం, సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అన్నక్యాంటీన్ వద్ద రోజువారీ వడ్డించే ఆహారపదార్థాలతో పాటు అదనంగా ఓ స్వీటు, మరో రెండు రకాల వంటకాలను అదనంగా వడ్డించారు. కార్యక్రమంలో గూడూరు వెంకట్రావు, గద్దె శ్రీనివాస్, నక్కా చిరంజీవి, స్థానిక నాయకులు పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయంలో స్త్రీశక్తి మహిళలతో కలిసి మండల టీడీపీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ఎంపీపీ షేక్ జబీన్, యార్డు ఛైర్‌పర్సన్ ఉన్నం ఝాన్సీరాణి, అలేఖ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆత్మపరిశీలన ముఖ్యం: రిన్పోచే



మత గురువు రిన్పోచే

తాడేపల్లి (వడ్డేశ్వరం), సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆత్మ పరిశీలన చేసుకుని, తనకు తానుగా మానసిక ప్రేరణ పొందాలని సింగపూర్‌కు చెందిన ప్రముఖ బౌద్ధ మతగురువు సింఘ థెక్‌చెన్ నమ్‌డ్రోల్ రిన్పోచే అన్నారు. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ గ్రీన్ ఫీల్డ్ క్యాంపస్‌లోని ఆర్‌అండ్‌డీ థియేటర్‌లో స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఏర్పాటుచేసిన ప్రత్యేక సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసగించారు. కార్యక్రమంలో సాక్ డైరెక్టర్ పి సాయివిజయ్, వర్సిటీ వీసీ పార్థసారధివర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ రాజశేఖరరావు, డాక్టర్ ఎన్ వెంకట రామన్, రిజిస్ట్రార్ కె సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, సాక్ డైరెక్టర్ పి.సాయివిజయ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు సమాజానికి అవసరం: కిట్స్ సెక్రటరీ శేఖర్

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల నూతన ఆవిష్కరణలు సమాజానికి అవసరమని కిట్స్ కళాశాల ఛైర్మన్ కోయ సుబ్బారావు సెక్రటరీ కోయ శేఖర్‌లు అన్నారు. మండలంలోని వింజనంపాడులోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జావా ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్‌పై నిర్వహించిన మూడు రోజుల హాక్‌థాన్‌లో రూపొందించిన నూతన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. మేక్ స్కిల్ సీఈవో పీ మధు టోక్నో ఫీచర్ ఇండియా సీఈవో బోయపాటి శివల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 39 టీమ్‌లు పాల్గొనగా మూడు ప్రాజెక్టులకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కే హరిబాబు, ఐటీ విభాగాధిపతి డాక్టర్ ఎంఎస్ఎస్ తదితరులు పాల్గొన్నారు.

వీజే అధ్యాపకుడు ఆరాధ్య శర్మకు పీహెచ్‌డీ

మంగళగిరి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి వీజే కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న బీవీఎల్ ఆరాధ్యశర్మకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీహెచ్‌డీని ప్రదానం చేసింది. ఈ మేరకు కళాశాలలో బుధవారం ఆరాధ్య శర్మను ఘనంగా సన్మానించారు. కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ ప్రెగడ రాజశేఖర్, వీజే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాదెళ్ల శ్రీనివాసరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అవ్వారి సత్యనారాయణ, వైస్‌ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో గెలుపుపై బీజేపీ సంబరాలు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ భారీ మెజారిటీతో గెలుపొందంతో.. స్థానిక బీజేపీ నాయకులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని ఆర్టీఈసీ డిపో సెంటర్‌లో బాణ సంచా పేల్చి, మిఠాయిలు పంచి పెట్టారు. నాయకులు గోవాడ వెంకట కృష్ణారావు, కలపాల శ్రీనివాసరావు, తోట జనార్దన్ రావు, తన్నీరు శివ రామకృష్ణ, గుడివాడ పవన్, ఎస్.ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ

తెనాలి క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంగలకుదురు వీఎస్ఆర్ అండ్ జేడీఎం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు బుధవారం క్రీడా దుస్తులను అందించారు. తెలుగు ఉపాధ్యాయురాలు సుభాషిణి తన భర్త తలతోటి జోసఫ్ జ్ఞాపకార్థం 25 మందికి దుస్తులు అందజేశారు. ప్రిన్సిపల్ ఎన్.అనురాధ, ఉపాధ్యాయులు సుభాషిణిని అభినందించారు.

భర్త, అత్తమామల వేధింపులపై ఫిర్యాదు

తెనాలి క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉప్పు బజారుకు చెందిన కోడూరి చంద్రిక అనే మహిళ తన భర్త, అత్తమామలు వేధిస్తున్నారని బుధవారం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు వివరాల మేరకు.. చంద్రికకు ఐదేళ్ల క్రితం ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన ప్రసన్నకుమార్‌తో వివాహం జరిగింది. వారికి పాప, బాబు ఉన్నారు. కొద్ది రోజులుగా.. భర్త, అత్తింటి హింసిస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

తెనాలి క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మార్తా గ్రూప్ ఆఫ్ నర్సింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. 2017 యాక్టు, ఎయిడ్స్‌పై అవగాహన 1097 టోల్ ఫ్రీ నంబరు గురించి వివరించారు. ఇన్‌స్టిట్యూట్ కరస్పాండెంట్ ఈశ్వరరావు, కమలాకర్, ప్రిన్సిపాల్ నళిని పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపునకు వర్క్‌షాప్ ఉపయుక్తం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఉపాధి అవకాశాలకు వారిలో నైపుణ్యాలను పెంపొందించేందుకు వర్క్‌షాప్ ఉపయోగపడుతుందని నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. జేఎంజే మహిళా కళాశాలలో బుధవారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వర్క్‌షాప్ నిర్వహించారు. నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఐబీఎం స్కిల్ బిల్డ్ ప్రోగ్రాం సంయుక్తంగా ఈ వర్క్‌షాప్ నిర్వహించాయి. ఐబీఎం ట్రైనర్ అశ్వనికుమార్ ఏఐ కాన్సెప్ట్, టూల్స్ వాస్తవ జీవిత వినియోగంపై వివరించారు. ప్రిన్సిపాల్ శాంత, సుధాకరయ్య, కో-ఆర్డినేటర్ మణికంఠ పాల్గొన్నారు.

ఓటమి భయంతో రాహుల్‌పై దాడులు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): బిహార్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే రాహుల్ గాంధీపై బీజేపీ వరస దాడులకు పాల్పడుతోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అందే దిలీప్ బుధవారం ఆరోపించారు. బిహార్ ఎన్నికల్లో బీజేపీ అక్రమాలను ఎత్తిచూపి.. ఎన్నికల కమిషన్ లోపాలను రాహుల్ గాంధీ బహిర్గతం చేస్తున్నారన్నారు. రాయిబరేలిలో రాహుల్ కాన్వాయ్‌పై బీజేపీ దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ దాడి ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు.

దోమల సంక్రమిత వ్యాధులపై అప్రమత్తం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దోమల కారణంగా వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ఆరోగ్య అధికారి మొవ్వా ఏసుబాబు పేర్కొన్నారు. 17వ వార్డులో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య పనులను బుధవారం ఆయన పర్యవేక్షించారు. మలేరియా సిబ్బందితో కలిసి దోమల యాంటీ లార్వా పిచికారీ పనులను పరిశీలించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఉమాకాంత్, బాలచంద్రమౌళి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వైద్యపరికరాల వితరణ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు పలు వైద్య పరికరాలను బుధవారం సూపరింటెండెంట్ సౌభాగ్యవాణికి అందించారు. ఈ ససందర్భంగా స్వచ్ఛంద సంస్థ సేవలను ఆమె అభినందించారు. సంస్థ రీజియన్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. రోగులకు వైద్యులు, సిబ్బంది మంచి వైద్య సేవలు అందించాలని కోరారు. చైర్మన్ కొలసాని రాంచంద్, వెంకట్, ప్రసాద్, సోమయ్యశాస్త్రి, మొవ్వా సత్యనారాయణ పాల్గొన్నారు.



నాయుడమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

దివంగత శాస్త్రవేత్త నాయుడమ్మకు ఘన నివాళి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): దివంగత శాస్త్రవేత్త యలవర్తి నాయుడమ్మ జయంతి బుధవారం చెంచుపేటలో నిర్వహించారు. డాక్టర్ యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు, వైస్‌చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రక్తకన్నీరు నాటకానికి ఎనలేని ఆదరణ

తెనాలి అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రక్త కన్నీరు నాటకం ఎనలేని ఆదరణ పొందిందని సాహిత్యవేత్త జి.లలితానంద ప్రసాద్ పేర్కొన్నారు. గాంధీ నగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో నిర్వహిస్తున్న కళాకారుల సంస్మరణలో భాగంగా బుధవారం రక్త కన్నీరు నాగభూషణం సంస్మరణ సభ నిర్వహించారు. బొల్లిముంత కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రంగస్థలం నుంచి సినీ రంగంలో ప్రవేశించిన నాగభూషణం వెయ్యికి పైగా సినిమాల్లో నటించారని తెలిపారు. బెల్లంకొండ వెంకట్, లక్ష్మణరావు, బాలస్వామి, బదరీనాథ్ పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



రహదారి పక్కన తగలబెడుతున్న వ్యర్థాలు



ములుకుదురు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్

లోపించిన చిత్తశుద్ధి

● గ్రామాల్లో నిరుపయోగంగా ప్లాంట్లు
● రహదారులపై తగలబడుతున్న వ్యర్థాలు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): చెత్త రహితంగా తీర్చిదిద్ది.. స్వచ్ఛ గ్రామాలుగా రూపొందించేందుకు నిర్మించిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లు నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రభుత్వం లక్షలాది రూపాయల వ్యయంతో ఈ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. ప్రతి రోజు గ్రామాల నుంచి వచ్చే వ్యర్థాలను సేకరించి.. ఇక్కడికి చేరుస్తారు. ఇందుకు గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. గృహాల నుంచి తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఈ ప్లాంట్లలో సెగ్రిగేషన్ ప్రక్రియను చేపడతారు. గ్రామాలను చెత్తరహితంగా తయారుచేయడమే కాకుండా.. పర్యావరణ పరిరక్షణ కోసం సంపద సృష్టి కేంద్రాలను ప్రభుత్వం ప్రతి గ్రామంలో నిర్మించింది. ప్రభుత్వ లక్ష్యాలను అందుకోవడంలో అధికారులు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరి కారణంగా.. సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్లాంట్లు నిర్వహణ లేక మూతపడే దశకు చేరుకున్నాయి. మెడి వేస్ట్, పలు రకాల హానికారిక వ్యర్థాలను పర్యావరణ హితంగా డీకంపోజ్ చేయడానికి సేకరించిన యంత్ర పరికరాలు కూడా మూలన పడి పనికిరాకుండా పోతున్నాయి.

ఆచరణ శూన్యం....

పొన్నూరు మండలంలో 29 గ్రామాల్లో ఈ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌లు ఉన్నాయి. కానీ ఒక్క ప్లాంట్లో కూడా శుద్ధి ప్రక్రియ నేటి వరకు ప్రారంభం కాలేదు. గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలను రహదారుల పక్కన పోసి.. తగలబెడుతున్నారు. గతం తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ సంపద సృష్టి కేంద్రాలను సద్వినియోగం చేసుకొన్నారు. తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు, పోడి చెత్తలోని ప్లాస్టిక్ వ్యర్థాలను విక్రయించగా.. వచ్చిన సొమ్మును గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించి, పంచాయితీలకు వనరులు సమకూర్చుకున్నారు. అయితే గత ఐదేళ్ల కాలంలో ఈ ప్లాంట్ల నిర్వహణ సక్రమంగా జరగకపోవడం వల్ల పూర్తిగా నిరుపయోగంగా మారాయి. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా స్పందించి వ్యర్థాలను తగలబెట్టకుండా రీసైక్లింగ్ ప్రక్రియను ప్రారంభించి.. సంపద సృష్టించుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



జగన్ అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలి : ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరుటౌన్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, బడుగు బలహీన వర్గాల నేత అచ్చెన్నాయుడుపై జగన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు తక్షణమే క్షమాపణ చెప్పాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ బుధవారం డిమాండ్ చేశారు. మద్యం కుంభకోణం కేసులతో జగన్ మతిస్థిమితం కోల్పోయారని ఎద్దేవ చేశారు. తండ్రి వయసు ఉన్న చంద్రబాబు మీద పదేపదే చావాలి, కాల్చి చంపాలి లాంటి సిగ్గులేని వ్యాఖ్యలు జగన్ మానుకోవాలని హితవు పలికారు. రాజకీయం కోసం బాబాయిని చంపి, ఆస్తుల కోసం తల్లిని, చెల్లిని కోర్టులకు లాగిన నీచ రాజకీయ నాయకుడు జగన్ ఒక్కరేనన్ని ఆగ్రహం వ్యక్తంచేశారు. జగన్ ప్రభుత్వ హయాంలో కంటే అధికంగా.. లక్ష టన్నుల యూరియా కూటమి ప్రభుత్వం అందించిందన్నారు. 2022లో ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి.. రైతు భరోసా కేంద్రాలను.. రైతు దోపిడీ కేంద్రాలుగా చేసిన దొంగ జగన్ అని దుయ్యబట్టారు. నకిలీ విత్తనాలు, సొసైటీల కుంభకోణాలు, రైతుల ఇన్సూరెన్స్ ఎగవేత, పంట నష్ట పరిహారం, ధాన్యం డబ్బుల ఎగవేత వంటి అనేక రకాలుగా రైతులను వ్యవసాయ రంగాన్ని మోసం చేసి రైతులపై కపట ప్రేమ చూపటం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్ అహంకారపు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తెలిపారు.



చేబ్రోలు: ఎమెల్యే ఆనందబాబును గజమాలతో సత్కరిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ తదితరులు



తెనాలి: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అజాతశత్రువు నక్కా ఆనందబాబు

● జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా

చేబ్రోలు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అజాత శత్రువు అని.. జనం హృదయంలో నిలిచిన నేత అని గుంటూరు జడ్పీ చైర్మన్ కత్తెర హేనీ క్రిస్టినా అన్నారు. మండలంలోని వడ్లమూడి గరువుపాలెం హార్వెస్ట్ ఇండియా ప్రాంగణంలో బుధవారం నక్కా ఆనందబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల పక్షాన ఆనందబాబు నిలబడి వారి అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి పంపిణీచేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్ కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ ఎమ్మెల్యే ఆనందబాబును గజమాలతో సత్కరించారు. కేఎస్‌కే టీం సభ్యులు, టీడీపీ నాయకులు సుద్దపల్లి నాగరాజు, రమేష్, అత్తోట శరత్, హరిప్రసాద్, నారాయణ ప్రసాద్, రవీంద్ర,సునీల్ పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తెనాలిలోని పార్టీ కార్యాలయంలో వేమూరు, తెనాలి నియోజకవర్గాల కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భారీ కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ, రెండు నియోజకవర్గాల్లో తనపై ఉంచిన అభిమానం మరువలేనిదన్నారు. ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, నిమ్మకాయల రమ్య, రమాదేవి, అనిత, మల్లేశ్వరి పాల్గొన్నారు.

యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా పై ఆందోళన చెందవద్దని.. సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారి ఆర్ వెంకటేశ్వరరావు తెలిపారు. మండల పరిధిలోని ఉప్పరపాలెం, సీతారాంపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట పొలాలను పరిశీలించిన అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. పొన్నూరు మండలానికి 580 మెట్రిక్ టన్నుల యూరియా ఇండెంట్ పెట్టడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో రైతు సేవా కేంద్రాలు, సొసైటీలు, జీడీసీఎంఎస్ పాయింట్లకు యూరియా అందుబాటులో ఉంటుందని తెలిపారు. సీజన్లో కూడా అవసరమైన ఇండెంట్ పెట్టామని రైతులు అపోహలు నమ్మవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి ఐ.శ్రీకాంత్, వ్యవసాయి శాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



చేబ్రోలు: రైతులకు సూచనలు చేస్తున్న ఏవో ప్రియదర్శిని



పొన్నూరు: రైతులకు సూచనలు ఇస్తున్న అధికారులు

అధిక దిగుబడికి మిశ్రమ ఎరువులు వినియోగించాలి

చేబ్రోలు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడవర్రు, గుండవరం రైతు సేవా కేంద్రాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి ప్రియదర్శిని యూరియా వాడకం తగ్గించి.. మిశ్రమ ఎరువు వాడేలా ముందుకి రావాలని రైతులను కోరారు. దీంతో మొక్కకి అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాషియం అందుతుందని తెలిపారు. ఈ విధంగా ఎరువుల వినియోగంతో.. అధిక దిగుబడి వస్తుంద ని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'స్కోచ్' ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖకు స్కోచ్ అవార్డు రావడం రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. బుధవారం తెనాలిలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల్లో ప్రభుత్వం ఉచిత శిక్షణ అందించిందని, ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖకు ఈ ఏడాది అవార్డు ప్రకటించిందన్నారు. మంత్రి సవిత ఆధ్వర్యంలో బీసీ నిరుద్యోగులకు మంచి శిక్షణ అందుతుందన్నారు. 16 వేల టీచర్ పోస్టులు భర్తీ నిర్వహించడం, నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించాయని చెప్పారు. శిక్షణ కేంద్రాల్లో స్టైఫండ్, పుస్తకాల కొనుగోలుకు సహాయం అందిస్తూ 6,470 మంది బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా శిక్షణ అందుకున్నారని చెప్పారు.

వైభవంగా సంకటహర చతుర్థి వ్రతం

పెదకాకాని, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వేంకటేశ్వరస్వామి దివ్య క్షేత్రంలో మహాగణపతి స్వామికి బుధవారం సంకటహర చతుర్థి సందర్భంగా వైభవంగా వ్రతాలు జరిపించారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు, ఆలయ అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

పొన్నూరుటౌన్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): భూమి కోసం, భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం చేసిన వీరనారీమణి చాకలి ఐలమ్మ అని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా సమితి సభ్యురాలు అంగలకుదురు దుర్గాభవాని అన్నారు. పొన్నూరు పట్టణంలోని డీవీసీ కాలనీలో బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గ భవాని మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ప్రతి మహిళకు స్ఫూర్తి ప్రదాత అన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా వెట్టిచాకరి విముక్తి కోసం వీరోచిత పోరాటాలు నిర్వహించిందని గుర్తు చేశారు. మహిళా సమాఖ్య సభ్యులు దేవరకొండ తిరుపతమ్మ, భవాని, సీపీఐ పట్టణ కార్యదర్శి రామారావు, వెంకాయమ్మ, బుచ్చమ్మ, లక్ష్మీ వెంకటరత్నం, జానీ, ప్రణవి, కొండయ్య పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళా సమాఖ్య నిర్వాహకులు

సచివాలయ ఉద్యోగుల సమ్మె నోటీసు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల సమ్మె నోటీసు ఇచ్చారు. ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీకాంత్‌కు నోటీసు అందజేశారు. పలు సమస్యలపై ఇప్పటికే ఉద్యోగులు దశలవారీ ఆందోళనలు నిర్వహించారు. 15 రోజుల గడువు అనంతరం పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళతామని పేర్కొన్నారు



కమిషనర్ శ్రీకాంత్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు బ్రాహ్మణ కోడూరు విద్యార్థులు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు బ్రాహ్మణ కోడూరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అళ్ళ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మండల పరిధిలోని బ్రాహ్మణ కోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ నెల 8న రొంపిచర్ల జడ్పీ హైస్కూల్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల ఎంపికలు జరిగాయి. పాఠశాలకు చెందిన 9, 6వ తరగతి విద్యార్థులు కె. సంజన,జి.ధరణి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వచ్చే నెల 13 నుంచి 15 వరకు వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వారు పాల్గొంటారని తెలిపారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ తన్నీరు శివరామయ్య, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ జిల్లా ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ సునీత

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తులు

● జిల్లా ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ సునీత

కొల్లిపర, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ సునీతా పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మున్నంగిలో వ్యవసాయాధికారులు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సునీతా మాట్లాడుతూ రసాయనిక ఎరువులను అధికంగా వాడటం వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. భూమి సారం తగ్గిపోయి చౌడుగా మారుతుందన్నారు. రైతులు పండించే ఉత్పత్తుల్లో రసాయనిక అవశేషాలు ఉండటం వల్ల వ్యాధుల బారినపడుతున్నట్లు తెలిపారు. సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల రైతులు సాగు పెట్టుబడులు తగ్గించుకోవచ్చని వివరించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, సర్పంచ్ వేమూరి దీనమ్మ, అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సత్యన్నారాయణ, ఏవో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుసుం లేకుండా 'ఉద్యం' రిజిస్ట్రేషన్

● ఎంపీడీవో విజయలక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉద్యం పథకం రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఉద్యం రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన తర్వాత సర్టిఫికేట్‌ను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. ఈ సర్టిఫికేట్ ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారులు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం, ఇతర ప్రయోజనాలు పొందడానికి అవకాశం ఉందన్నారు. ఉద్యం రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్, ఏపీఎం రమాదేవి పాల్గొన్నారు.

జాగ్రత్తగా నిత్యావసరాల పంపిణీ

● తహసీల్దార్ సిద్ధార్థ



రేషన్ దుకాణాలు తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): చౌక డిపో డీలర్లు నిత్యావసర సరుకుల పంపిణీ విషయంలో జాగ్రత్తగా ఉండాలని తహసీల్దార్ సిద్ధార్థ ఆదేశించారు. బుధవారం కొల్లిపరలో రేషన్‌షాపులను ఆయన తనిఖీ చేశారు. నిత్యావసర సరుకుల పంపిణీపై డీలర్లకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రేషన్ పంపిణీలో అవకతవకలు జరిగితే.. డీలరుపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలో ఆర్ఐ వంశీకృష్ణ, వీఆర్వో భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.